
http://www.agnidharanews.com
# అగ్నిధార
నిజాల నిప్పు కణిక
గురువారం 4 జూన్ 2026
పేజీలు : 5 వెల : 5/-
Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను
ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు
సెల్ : 80088 17828



# డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్

- సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి
- సదస్సులో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడికి ఆహ్వానం
- సానుకూలంగా స్పందించిన మషాటిలే
- భారత్, దక్షిణాఫ్రికాల మధ్య చారిత్రక

హైదరాబాద్:
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2026 కార్యక్రమాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనాలంటూ దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు ఆ దేశ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే సానుకూలంగా స్పందించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో పాల్ మషాటిలే నేతృత్వంలోని దక్షిణాఫ్రికా ప్రతినిధుల బృందంతో సీఎం సమావేశమయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్య పర్యాటకం, పరిశ్రమలు, పెట్టుబడుల విషయంలో పరస్పర సహకారంపై చర్చించారు. గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ పారిశ్రామికవేత్తలు పాల్గొనడంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయని సీఎం గుర్తు చేశారు. ఐటీ, ఫార్మా, రక్షణ, తయారు చేసి ప్రపంచానికి అందించే విధంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పారు. ఫారరీచ్యన్ 500 కంపెనీలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జీసీసీలు) హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో మధ్యప్రాచ్య, ఇతర అనేక దేశాల నుంచి వైద్యం కోసం హైదరాబాద్‌కు - మిగతా3లో



## విద్యార్థులకు గుడ్‌న్యూస్

- వాళ్లందరికీ రూ.10 లక్షలు
- తొలి కేబినెట్‌లో సీఎం సంచలన నిర్ణయాలు!
- డీకే శివకుమార్ నాయకత్వంలో తొలి మంత్రివర్గ సమావేశం
- కీలక ప్రకటనలు చేసిన కొత్త ముఖ్యమంత్రి డీకే శివకుమార్!

## సభ పెట్టుకోవడం అనేది నా హక్కు దాన్ని కాదనకూడదు



- తెలంగాణ నేతల వ్యాఖ్యలపై స్పందించిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్
- రాష్ట్ర విభజనకు నేను ఎప్పుడూ వ్యతిరేకం కాదని మరోసారి స్పష్టం
- తెలంగాణ, తమిళనాడులో ప్రాంతీయ భావం ఉందని వెల్లడి
- సభకు అనుమతి ఇవ్వడం చిన్న

హైదరాబాద్
తెలంగాణ భూమి పుత్రుల జాగీరేనని జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా పర్యటనలో ఉన్న పవన్ కల్యాణ్ మంగళవారం హైదరాబాద్?లోని తన నివాసంలో జరిగిన సభ గురించి స్పందించారు. ఈ 12 ఏళ్లలో అనేకమంది ఏపీ కాంట్రాక్టర్లు తెలంగాణలో పని చేశారన్న పవన్ కల్యాణ్ఈ 12 ఏళ్లలో అనేకమంది తెలంగాణ కాంట్రాక్టర్లు ఏపీలో పని చేశారని తెలిపారు. తన సభకు అనుమతి ఇవ్వడం చిన్న విషయమని, ఇస్తే గొడవే వచ్చేది కాదని అన్నారు. హైదరాబాద్‌లో తనకు ఇల్లు ఉందని, అక్కడ ఉండటం సాధారణమని పేర్కొన్నారు. సభ

## బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లది గిరిజన



- ఆదివాసీల హక్కులను హరించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ యత్నిస్తున్నాయ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు గిరిజనుల పట్ల వ్యతిరేక మనస్తత్వం ఉంది
- గిరిజనుల ప్రాణాధారమైన జల్, జంగల్, జమీన్ హక్కులను హరిచేందుకు ఆ రెండు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు



## 'సెక్షన్ 301' విషయంలో యూఎస్‌తో చర్చలు జరుపుతున్నాం

- అమెరికా టారిఫ్‌ల ప్రతిపాదనల వేళ భారత్
- వెట్టిచాకిరి నిర్మూలనలో విఫలమైన 60 దేశాలపై అదనపు సుంకాలు విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రతిపాదన
- దీనిపై స్పందించిన భారత్
- సెక్షన్ 301 ప్రొసీడింగ్స్ విషయంలో యూఎస్‌తో చర్చలు జరుపుతున్నామని వెల్లడి


## విమానయాన రంగానికి ప్యాకేజీ

- రహదారులకు భారీగా నిధులు
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు
- రవాణా రంగం బలోపేతానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- 24,249 కోట్ల పెట్టుబడితో 4 ప్రధాన రహదారి ప్రాజెక్టులకు ఆమోదం
- వివరాలు వెల్లడించిన కేంద్ర



# నిధుల 'బాట'.. ఖర్చుపై కొట్లాట

- తెలంగాణ జాతీయ రహదారుల విస్తరణకు రూ.7,597.16 కోట్లు కేటాయింపు
- ఆర్మూర్--జగిత్యాల--మంచిర్యాల, జగిత్యాల-కరీంనగర్ మార్గాల అభివృద్ధి
- కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం
- రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఇప్పటికే పేర్కొన్న రైల్వే
- రైల్వేనే చూసుకోవాలని తేల్చి చెప్పేందుకు




న్యూఢిల్లీ
తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్మూర్--జగిత్యాల--మంచిర్యాల (ఎన్ హెచ్--63), జగిత్యాల--కరీంనగర్ (ఎన్‌హెచ్--563) జాతీయ రహదారులను నాలుగు లేన్లుగా విస్తరించే భారీ ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మొత్తం 190.76 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఈ రహదారుల విస్తరణ ప్రాజెక్టు - మిగతా3లో

# విమానయాన రంగానికి ప్యాకేజీ

రవాణా రంగం బలోపేతానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 24,249 కోట్ల పెట్టుబడితో 4 ప్రధాన రహదారి ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో తెలంగాణకు చెందిన చీఎ-63, చీఎ-563 జాతీయ రహదారుల విస్తరణకు ఆమోదం దక్కింది. ఈ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో ఈ నాలుగు ప్రధాన రహదారి ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. వీటి ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని చెప్పారు. అలాగే, ఢిల్లీలో పాత ట్రక్కులు, బస్సులు తొలగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పాత బస్సుల స్థానంలో బీఎస్ 6, ఈవీ వాహనాలు తేవాలని నిర్ణయించినట్టు చెప్పారు. కొత్త వాహనాల కోసం 5,041 కోట్ల విడుదలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్టు వివరించారు. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.



"ఢిల్లీ, ఎన్‌సీఆర్?లో నడుస్తున్న పాత ట్రక్కులు, బస్సుల స్థానంలో కొత్త వాటిని తీసుకురావడానికి ఉద్దేశించిన రూ. 5,041 కోట్ల పథకాన్ని కేబినెట్ ఆమోదించింది. ఢిల్లీ కాలుష్యాన్ని అదుపులోకి తీసుకురావడానికి ఇటీవల అనేక చర్యలు తీసుకున్నారు. పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కల పెంపకం, ఎలక్ట్రిక్ వాహనాల వాడకం, ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పన, ఇంకా ఇలాంటి అనేక ఇతర చర్యలపై ప్రధానంగా దృష్టి సారించారు. అందువల్ల, పాత వాహనాల స్థానంలో ఆధునిక, తక్కువ ఉద్గారాలు వెలువరించే బీఎస్6, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడానికి ఒక పథకాన్ని రూపొందించారు. ప్రత్యేకంగా, ఇది పాత ట్రక్కులు, బస్సుల స్థానంలో కొత్త వాటిని తీసుకురావడంపై దృష్టి పెడుతుంది. ఇది చాలా మంచి పథకం, ఎందుకంటే ఇది ప్రజలు తమ పాత ట్రక్కులు, బస్సులను మార్చుకోవడానికి ప్రోత్సాహాన్ని అందిస్తుంది."

**'పాత వాహనాలను తప్పనిసరిగా స్క్రాప్? చేయాలి'**

అయితే, ఈ పథకం అమలు పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతుందని వెల్లడించారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి అధ్యక్షతన ఉన్న ఉన్నతస్థాయి కమిటీ ఈ పథకాన్ని పర్యవేక్షిస్తుందని చెప్పారు. మరోవైపు, దీూ-××× లేదా అంతకంటే పాత వాహనాలను తప్పనిసరిగా స్క్రాప్ చేయాలని అశ్వినీ వైష్ణవ్? సూచించారు. "దీూ-×ఎ వాహనాలను స్క్రాప్ చేయవచ్చు లేదా చీజ= వెలుపల అమ్ముకోవచ్చు. కొత్తగా కొనుగోలు చేసే వాహనం దీూ-ఎ× లేదా ఎలక్ట్రిక్ వాహనం కావాలి. ఢిల్లీలో ఈ పథకం కింద కొనుగోలు చేసే లైట్ గూడ్స్ వాహనాలు తప్పనిసరిగా ఎలక్ట్రిక్ కావాలి. బస్సులు దీూ-ఎ× సీఎన్‌జీ లేదా ఎలక్ట్రిక్ మాత్రమే ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద రుణాలపై 5 సంవత్సరాల పాటు 5శాతం వడ్డీ సబ్సిడీ, నెలకు గరిష్ఠంగా రూ. 4,800 వరకు ఇంధన వోచర్లు, జుఎ కొనుగోలుపై అదనపు ప్రయోజనాలు అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు, మోటార్ వాహన పన్నులో 100శాతం వరకు రాయితీ, పాత వాహనాల బకాయిల మాఫీ వంటి సదుపాయాలు కల్పిస్తాయి" అని అశ్వినీ వైష్ణవ్? పేర్కొన్నారు. మరోవైపు, పశ్చిమాసియా సంక్షోభం, పాక్ గగనతల మూసివేత వంటి సవాళ్ల నేపథ్యంలో దేశీయ విమానయాన రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర కేబినెట్ సరికొత్త వ్యూహాత్మక ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్-ాుఖీ ధరల భారం నుంచి విమానయాన సంస్థలను కాపాడటానికి చమురు సంస్థలకు 10 వేల కోట్లను వడ్డీ లేని ఆర్థిక సాయంగా ప్రకటించింది.

# విద్యార్థులకు గుడ్‌న్యూస్

కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా బుధవారం బాధ్యతలు తీసుకున్న వెంటనే డీకే శివకుమార్ తొలి కేబినెట్ సమావేశం నిర్వహించారు. డీకే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఆయన శుభవార్త చెప్పారు. విద్యార్థులందరికీ ఫ్రీ బస్‌పాస్‌లు ఇస్తామని ప్రకటించారు. ఈ పాస్?లతో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగానే ప్రయాణించవచ్చని తెలిపారు. అలాగే రాష్ట్రంలో రైతుల వలసలు అరికట్టేందుకు తగిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వీటితోపాటు డీకే తొలి కేబినెట్ మీటింగ్?లో ఇతర సంక్షేమ కార్యక్రమాలపైనా నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయాలను ముఖ్యమంత్రి శివకుమార్ వెల్లడించారు. మరి అవేంటంటే? ప్రస్తుతం కర్ణాటకలో ఆర్టీసీ బస్సుల్లో అమ్మాయిలకు, మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణం అమల్లో ఉంది. అయితే ఉచిత ప్రయాణం కోసం యువత నుంచి డిమాండ్ వస్తుందని అందుకే రాష్ట్రంలో విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాస్‌లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇక ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకాల కోసం, త్వరలోనే క్యాలెండర్‌ను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఇందులో ఎన్‌రోల్ చేసుకునేందుకు ప్రైవేట్ ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలను నెల రోజుల్లోగా ఖరారు చేసి, ప్రభుత్వమే వీటిని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అలాగే ప్రభుత్వం ఇప్పటికే 56వేల ఉద్యోగాలను ప్రకటించిందని సీఎం అన్నారు. తదుపరి కేబినెట్ సమావేశం నాటికి, అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నోటిఫికేషన్‌లు ఎప్పుడు జారీ చేస్తారు? నియామక ప్రక్రియ ఎలా ఉంటుంది? అనే వివరాలతో ఒక క్యాలెండర్‌ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. యువతకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పన కోసమే కేబినెట్?లో గంటకుపైగా చర్చించామని డీకే అన్నారు.



**10వేల భారత్ జోడో యువ సంఘాల ఏర్పాటు!**

యవతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా 10వేల భారత్ జోడో యువ సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒక్కో యువ సంఘానికి రూ.10 లక్షలు అందజేస్తామని అన్నారు. ఒక్కో యువజన సంఘంలో రాష్ట్రంలో ప్రతి గ్రామ పంచాయతీ, పట్టణ వార్డుల్లో 150 నుంచి 200 మంది సభ్యులు ఉంటారని సీఎం తెలిపారు. ఆ సంఘాల కార్యకలాపాలు క్రీడలు, సంస్కృతి, విద్య, నాయకత్వ అభివృద్ధిపై కేంద్రీకృతమ్యేలా ఉంటాయని అన్నారు.

**బెంగళూరుకు రూ.2వేల కోట్లు!**

ఇక అనధికార భవనాల యజమాన్యాలకు కూడా ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తుందని శివకుమార్ చెప్పారు. అందులో భాగంగానే బెంగళూరులో ప్రస్తుతం 1200 చదరపు అడుగుల స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ అవసరం లేదు. అందులోంచి వీటికి మినహాయింపు ఉంది. ఇకపై దీనిని 2500 చదరపు అడుగుల నిర్మాణాలకూ వర్తింపజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇక గ్రేటర్ బెంగళూరు అథారిటీ, బెంగళూరు డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని ప్రాంతాలతో సహా, బెంగళూరులో రహదారి మౌలిక సదుపాయాల పనుల కోసం రూ. 2,000 కోట్ల నిధుల కేటాయింపును మంత్రివర్గం ఆమోదించింది. చివరగా, ప్రజాస్వామ్య నాలుగు స్తంభాలు సమన్వయంతో పనిచేయాలని నొక్కి చెప్పారు. తాను ప్రభుత్వ విమర్శలకు వ్యతిరేకం కాదని, అయితే మీడియా 'కల్పిత కథనాలు' ప్రసారం చేయకూడదని అన్నారు. ప్రభుత్వానికి సహకరించాలని శివకుమార్ మీడియాకు విజ్ఞప్తి చేశారు.

# 'సెక్షన్ 301' విషయంలో యూఎస్‌తో చర్చలు జరుపుతున్నాం

వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతులను నిషేధించడంలో విఫలమైన భారత్ సహా 60 దేశాలపై అదనపు సుంకాలు విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అమెరికా ప్రభుత్వాన్ని ప్రతిపాదించడంపై ఇండియా స్పందించింది. వెట్టిచాకిరి చేసే కార్మికులు, అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించిన ఆందోళనలపై సెక్షన్ 301 ప్రొసీడింగ్స్ విషయంలో భారత్ అమెరికాతో సంప్రదింపులు జరుపుతోందని పేర్కొంది. అదే సమయంలో వాషింగ్టన్‌తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా కృషి చేస్తోందని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటన చేసింది. భారత్‌తో సహా 60 దేశాలపై తీసుకున్న చర్యలకు సంబంధించి యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ దర్యాప్తును పూర్తి చేసిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దర్యాప్తుల అనంతరం 1974 నాటి యూఎస్ వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 ప్రకారం ఈ 60 దేశాల దిగుమతులపై అదనపు సుంకాలను విధించాలని అమెరికా ప్రభుత్వాన్ని ప్రతిపాదించిందని పేర్కొంది. అయితే ఇప్పటికే సెక్షన్ 232 సుంకాల పరిధిలోకి వచ్చే ఉత్పత్తులతో పాటు, మరికొన్ని ఇతర వర్గాలను ఈ ప్రతిపాదిత చర్యల నుంచి మినహాయించిందని స్పష్టం చేసింది. "సెక్షన్ 301 ప్రొసీడింగ్స్‌పై దర్యాప్తు విషయంలో అమెరికాతో భారత్ సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2న ప్రకటించినట్లుగా, ఫిబ్రవరి 7 విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనకు అనుగుణంగా ఒక ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కూడా భారత్ సమాంతరంగా అమెరికాతో సంప్రదింపులు జరుపుతోంది. సెక్షన్ 301 కింద యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రతిపాదిత టారిఫ్‌లు ఇంకా ఖరారు కాలేదు. ఆయా దేశాలు 2026 జూన్ 22 వరకు తమ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనడానికి అభ్యర్థనలను యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్‌కు సమర్పించవచ్చు. లిఖితపూర్వక అభ్యర్థనలను 2026 జులై 6 వరకు సమర్పించవచ్చు. "



**మూడు నెలల క్రితమే దర్యాప్తు ప్రారంభం**

వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన వస్తువులను దిగుమతి చేయడం, అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించిన ఆందోళనలపై ఇండియా సహా 60 దేశాలపై 2026 మార్చి 11, 12 తేదీలలో రెండు వేర్వేరు సెక్షన్ 301 విచారణలను యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రారంభించింది. ఈ క్రమంలో జూన్ 2న కీలక నిర్ణయం తీసుకుంది. వెట్టిచాకిరీ కార్మికులు విషయంలో తన దర్యాప్తు వివరాలను విడుదల చేసింది. 60 దేశాలపై అదనపు సుంకాలను విధించాలని అమెరికా ప్రభుత్వానికి ప్రతిపాదిస్తూ నిర్ణయం తీసుకొంది. 54 దేశాలపై 12.5శాతం, ఆరు దేశాలపై 10 శాతం సుంకాలను విధించాలని ట్రంప్ సర్కార్‌ను కోరింది. ఈ మేరకు యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమీసన్ గ్రీర్ ఓ ప్రకటన చేశారు.

ఈ ప్రతిపాదనలో కెనడా, ఈక్వెడార్, యూరోపియన్ యూనియన్ (ఈయూ), ఇండోనేసియా, మెక్సికో, పాకిస్థాన్‌ల దిగుమతులపై 10 శాతం అదనపు సుంకం, అలాగే భారత్, చైనాలతో సహా మరో 54 దేశాల దిగుమతులపై 12.5 శాతం సుంకం విధించడం ఉంది. కాగా, వాణిజ్య రంగంలో పాక్, ఇండోనేసియాలు భారత్‌కు ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి. కాగా, 60 దేశాలపై అదనపు సుంకాల చర్య ఇంకా ప్రతిపాదన దశలోనే ఉంది. ఇంకా అమలవ్వలేదు.

**'వెట్టిచాకిరి కారణంగా అమెరికా కార్మికులకు ఇబ్బందులు'**

కాగా, వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతుల నిషేధంపై యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జెమీసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ వాణిజ్య భాగస్వామ్య దేశాలు కూడా వెట్టిచాకిరి చేసే కార్మికులు తయారుచేసిన దిగుమతుల నిషేధంలో అరికట్టలేకపోయాయని అన్నారు. ఈ విషయం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. వెట్టిచాకిరీ కారణంగా అంతర్జాతీయ లేబర్ మార్కెట్లో అమెరికా కార్మికులకు తీవ్ర పోటీ ఎదురవుతోందని చెప్పారు. అసమానతలను తాము ఇక సహించలేమని అసహనం వ్యక్తం చేశారు.

## బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లది గిరిజన వ్యతిరేక మనస్తత్వం.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు గిరిజనుల పట్ల వ్యతిరేక మనస్తత్వాన్ని కలిగి ఉన్నాయని కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. గిరిజనుల ప్రాణాధారమైన జల్, జంగల్, జమీన్ (నీరు, అడవులు, భూమి) హక్కులను హరిచేందుకు ఆ రెండు సంస్థలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. గిరిజనుల పురోగతిని అడ్డుకుంటూ, వారి ప్రాథమిక హక్కులను హరించడమే బీజేపీ-ఆర్ఎస్ఎస్‌ల ముఖ్య ఉద్దేశమని రాహుల్ పేర్కొన్నారు. 'ఆదివాసీ కాంగ్రెస్' ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా భవన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాహుల్ పాల్గొన్నారు. అనంతరం, సోషల్ మీడియా పోస్ట్ ద్వారా ఈ వ్యాఖ్యలు చేశారు.

"ఆదివాసీలే భారతదేశానికి అసలైన సంరక్షకులు. భారత చారిత్రక స్పృహ, విజ్ఞత ఎవరిలో అయితే మూర్తీభవించి ఉన్నాయో, ఆ వ్యక్తులే వీరు. ఇదే సత్యం. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లది గిరిజన వ్యతిరేక మనస్తత్వం. మిమ్మల్ని వనవాసులుగా ముద్రవేసి, మీకు ఉన్న జల్, జంగల్, జమీన్ హక్కులను దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి." ఆదివాసీల హక్కులు, రక్షణ కోసం పోరాడుతుందని కాంగ్రెస్ పార్టీ రాహుల్ స్పష్టం చేశారు. ఆదివాసీల అస్తిత్వాన్ని, వారి జల్, జంగిల్, జమీన్ హక్కులను కాపాడే వరకు తమ పోరాటం ఆగదని ఆయన పేర్కొన్నారు.

**ఎం. కరుణానిధి సేవలను గుర్తుచేసుకున్న రాహుల్**

మరోవైపు, బుధవారం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి జయంతి సందర్భంగా రాహుల్‌గాంధీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరుణానిధిని ఒక రచయిత, కవి, మేధావిగా రాహుల్ అభివర్ణించారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల పట్ల ఆయన జీవితకాల నిబద్ధతను గుర్తుచేసుకున్నారు. "ఎం.కరుణానిధి కేవలం ముఖ్యమంత్రి మాత్రమే కాదు. ఒక రచయిత, కవి, మేధావి. ప్రతి భారతీయుడిని సమానంగా చూసే రాజ్యాంగాన్ని ఆయన విశ్వసించారు. కళైజ్ఞర్ జయంతి సందర్భంగా ఆయనకు నా వినయపూర్వక నివాళులు అర్పిస్తున్నా. తమిళనాడు ప్రజల ఆరాధ్య నాయకుడైన ఆయన సామాజిక న్యాయం, సమానత్వం, హేతుబద్ధమైన ఆలోచన, ప్రజాస్వామ్య విలువల పట్ల జీవితాంతం నిబద్ధతతో లెక్కలేనన్ని జీవితాలను మార్చారు. కరుణానిధి కళ, సాహిత్యం సహా ప్రజా జీవితానికి చేసిన అపారమైన సేవను ప్రగాఢమైన గౌరవంతో ఎప్పటికీ గుర్తుంచుకుంటాం" " అని రాహుల్? గాంధీ ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

**'కరుణానిధి జీవితాలను మార్చారు'**

అలాగే, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే కూడా కరుణానిధికి నివాళులర్పించారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఆయన చేసిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

**తండ్రి సేవలను స్మరించుకున్న స్టాలిన్?**

తన తండ్రి జయంతి సందర్భంగా డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ బుధవారం చెన్నైలోని ఓమందరార్ ప్రభుత్వ ఎస్టేట్‌లో ఉన్న కళైజ్ఞర్ కరుణానిధి విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. పార్టీ నాయకులతో కలిసి వచ్చిన స్టాలిన్, పుష్పాలు సమర్పించి, తమిళనాడు రాజకీయ, సామాజిక అభివృద్ధికి కరుణానిధి చేసిన సేవలను స్మరించుకున్నారు. స్మారక కార్యక్రమాల్లో భాగంగా ఆయన చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేసి, అనంతరం పార్టీ యువజన విభాగం కార్యాలయాన్ని సందర్శించారు. ముత్తువేల్ కరుణానిధి (1924 జూన్ 3- 2018 ఆగష్టు 7) తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) పార్టీకి అధ్యక్షుడిగా దశాబ్దాల పాటు పనిచేశారు. ఆయనను ప్రజలు, అభిమానులు ఆప్యాయంగా "కళైజ్ఞర్" (అంటే కళాకారుడు) అని పిలుచుకుంటారు. అంతేకాదు, తన సుదీర్ఘమైన 60 ఏళ్ల రాజకీయ జీవితంలో, తాను పోటీ చేసిన ఏ ఒక్క ఎన్నికలోనూ ఓడిపోలేదు.

## సీబీఎస్ఈ వివాదం..

## రంగంలోకి కేంద్రం

**న్యూఢిల్లీ :** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ రీవేల్యూషన్ ప్రక్రియలో లోపాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. బోర్డు ఛైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాంశు గుప్తాలనుబదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త ఛైర్మన్‌గా లోఖండే ప్రశాంత్ సీతారామ్, కార్యదర్శిగా వరుణ్ భరద్వాజ్‌ను నియమించింది. అంతేకాదు,ఈ వివాదంపై విచారణకు కమిటీని నియమించింది. ఛైర్మన్ హోదాలో సీబీఎస్ఈ బోర్డు మొత్తం పనితీరు, పరిపాలన బాధ్యతలను రాహుల్ సింగ్ నిర్వర్తిస్తుండగా.. బోర్డుకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, ఆడిట్, ప్రజా సంబంధాలు వంటి విభాగాలను హిమాంశు చూసుకుంటున్నారు.ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానం అమలు, విద్యార్థులు నుంచి వచ్చిన సమస్యలపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సామర్థ్య నిర్మాణ కమిషన్ ఛైర్‌పర్సన్ ఎస్. రాధా చౌహాన్ ఈ ఏకసభ్య కమిటీకి అధ్యక్షత వహిస్తారు. ఈ కమిటీ తన నివేదికను నెలలోగా సిబ్బంది వ్యవహారాలు- శిక్షణ విభాగానికి సమర్పిస్తుంది. మరోవైపు, ఓఎస్ఎం అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సంజయ్ కుమార్‌తో పాటు రాహుల్ సింగ్‌కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది.జవాబు పత్రాలు తారుమారు కావడం, మూల్యాంకనంలో తప్పులు, తప్పుడు దిశానిర్దేశం, తప్పుడు గ్రేడ్‌ల కేటాయింపు వంటి అనేక సమస్యలు ఉన్నాయి. స్కాన్ చేసిన కాపీల తమవి కావని కనుగొన్నారు. మూల్యాంకన ప్రక్రియలో సుమారు 20 జవాబు పత్రాల పొంతన లేనివిగా గుర్తించినట్లు సీబీఎస్ఈ అధికారులు అంగీకరించారు. వేదాంత్ అనే విద్యార్థి తన సమాధాన పత్రం కాదని, వేరే ఎవరో రాసిన పేపర్లు తనదాంటో కలిపేశారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయ్యింది. దీంతో దేశవ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు తమకూ ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని వాపోయారు. ఈ వివాదంపై ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

## పెట్రోల్, గ్యాస్ కష్టాలు తీరినట్టే...

## అమల్లోకి వచ్చిన సీఈపీఏ



**న్యూఢిల్లీ :** అమెరికా?ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ ఇంధన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు భారీగా పెరిగి, సరఫరా కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ఊరట లభించింది.హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచంలోని అత్యధిక చమురు, గ్యాస్ రవాణా జరుగుతుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల నౌకల రవాణాలో అంతరాయం ఏర్పడటంతో భారత్‌కు ఇంధన సరఫరా దెబ్బతిన్నది. దీని ప్రభావంతో పెట్రోల్, ఎల్‌పీజీ ధరలు పెరిగాయి. సరఫరా కొరత ఏర్పడింది. పానిక్ బయింగ్ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్‌కు ప్రత్యామ్నాయ మార్గం అవసరమైంది.భారత్?ఒమన్ మధ్య కుదిరిన కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) 2025, జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఒమన్‌లోని ప్రధాన పోర్టులు (సలాలా, దుక్మ్ వంటివి) ద్వారా భారత్‌కు చమురు, ఎల్ఎన్‌జీ, ఇతర ఇంధన ఉత్పత్తులు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతాయి. ఒమన్ తీర ప్రాంతం హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉండటం ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనదిగా మార్చింది. ఇది భారత్‌కు సురక్షితమైన, నమ్మదగిన ఇంధన సరఫరా మార్గాన్ని అందిస్తోందిఒమన్‌తో ఒప్పందం కారణంగా హోర్ముజ్‌పై అత్యధిక ఆధారపడటం తగ్గుతుంది. పెట్రోల్, ఎల్‌పీజీ, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంటుంది. ధరల పెరుగుదల నియంత్రణలో ఉంటుంది. ప్రజల ఆందోళన తగ్గి, సాధారణ సరఫరా పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ఒప్పందం కేవలం తాత్కాలిక పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా భారత్ ఇంధన దిగుమతులను వైవిధ్యపరచడంలో, సప్లై చైన్‌ను బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలుస్తుంది.ప్రస్తుత భూరాజకీయ పరిస్థితులు ఏ సమయంలోనైనా హోర్ముజ్ జలసంధిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఒమన్ లాంటి స్నేహపూర్వక దేశంతో బలమైన వాణిజ్య ? ఇంధన భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం భారత్ దూరదృష్టి, వ్యూహాత్మక విజ్ఞతను చూపిస్తోంది. ఇది భారత్ ఇంధన భద్రతలో కొత్త అధ్యాయం.

# నిధుల 'బాట'.. ఖర్చుపై కొట్లాట

-మొదటిపేజీ తరువాయి

కోసం కేంద్రం రూ.7,597.16 కోట్లను కేటాయించింది. నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల మీదుగా వెళ్లే ఈ రహదారుల విస్తరణతో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ముఖ్యంగా జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రద్దీని నివారించేందుకు ఈ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా బైపాస్ రోడ్లను నిర్మించనున్నారు. అంక్సాపూర్, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, లక్సెట్టిపేట, మంచిర్యాల, పోతారం, గంగాధర తదితర ప్రాంతాల్లో బైపాస్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఓపెన్ టోలింగ్ విధానం(టోల్‌బూత్‌ల వద్ద వాహనాలు ఆగకుండా, నేరుగా హైవే వేగంతో ప్రయాణించడానికి అనుమతించే ఆధునిక ఎలక్ట్రానిక్ వ్యవస్థ)తో వాహనాలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఈ నాలుగు లేన్ల మార్గాన్ని డిజైన్ చేశారు. రహదారుల విస్తరణ పూర్తయితే ఆర్మూర్ నుంచి మంచిర్యాల మధ్య సుమారు గంటన్నర ప్రయాణ సమయం ఆదా కానుంది. జగిత్యాల నుంచి కరీంనగర్ మధ్య 45 నిమిషాల ప్రయాణ సమయం కలసిరానుంది. ప్రయాణికులు, సరుకు రవాణా వాహనాలకు సురక్షితమైన, వేగవంతమైన కనెక్టివిటీ లభించనుంది.

భూసేకరణ ఖర్చు అంటేనే రాష్ట్ర ప్రభుత్వం బెంబేలెత్తాల్సి వస్తోంది. భూసేకరణ ప్రక్రియే చాలా క్లిష్టమైంది కావటంతో దాన్ని కొలిక్కి తేవటం పెద్ద సవాలుగా ఉంటే, దాని వ్యయాన్ని భరించాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం--రైల్వే మధ్య రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు వివాదం నెలకొంటోంది. రీజినల్ రింగురోడ్డుకు అనుసంధానంగా రింగు రైలు ప్రాజెక్టును చేపట్టాలని రైల్వే శాఖ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సమ్మతించటంతో ఆ ప్రాజెక్టు ముందడుగేసింది. ఇక్కడే ఇప్పుడు పేచీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది. భూసేకరణకు సంబంధించి ఇప్పుడు కసరత్తు ప్రారంభించాల్సి ఉంది. దీంతో భూసేకరణ బాధ్యత మీదంటే మీదే అన్నది తెరమీదకు వస్తోంది. రీజినల్ రింగురోడ్డును ఆనుకొని రైల్వే లైన్ నిర్మించాలన్నది ఆలోచన. ఇప్పటికే రీజినల్ రింగురోడ్డుకు 100 మీటర్ల వెడల్పుతో ఉత్తర భాగానికి అలైన్‌మెంట్ ఖరారైంది.

దక్షిణ భాగానికి ఇంకా కొలిక్కి రాలేదు. ఉత్తర భాగానికి అనుమతి ఇచ్చే సమయంలో, ఖర్చు తగ్గించుకునే చర్యల్లో భాగంగా రోడ్డును 90 మీటర్ల వెడల్పునకే పరిమితం



చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఆ మిగిలిన 10 మీటర్ల వెడల్పు భాగానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని సూచించింది. అప్పుడు ఆ పది మీటర్ల వెడల్పు భాగానికి పూర్తి భూసేకరణ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. దీంతో దీన్ని తీసుకోవాలా వద్దా అని తటపటాయిస్తున్న తరుణంలో, రింగు రైలు భూసేకరణ అంశం తెరమీదకు వచ్చింది. రింగురైలుకు అవసరమైన 35 మీటర్లు/ 40 మీటర్ల వెడల్పుతో ఉండే అలైన్‌మెంట్ భూసేకరణ వ్యయం మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని రైల్వే శాఖ పేర్కొంటోంది. అలా కాదు, మొత్తం భూసేకరణ వ్యయాన్ని రైల్వేనే భరించాలని ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. ఈ నెలాఖరుకు డీపీఆర్ సిద్ధమవుతున్నందున, దీనిపై ఓ ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడు ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వం--రైల్వే మధ్య పేచీకి కారణమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

### 'రింగు'కు ఆనుకునా.. దూరంగానా..

రీజినల్ రింగురోడ్డును ఆనుకునే రింగు రైలు ప్రాజెక్టుకు భూసేకరణ చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం--ఎన్‌హెచ్ఏఐ--రైల్వే సంయుక్త సమావేశంలో ప్రాథమికంగా నిర్ణయించారు. కానీ, ఇప్పుడు దానిమీద మళ్లీ పునరాలోచించాలని భావిస్తున్నారు. రింగురోడ్డు మలుపులు--రైల్వే లైను మలుపులు--గ్రేడియంట్‌లో చాలా తేడా ఉంటుంది. రైల్వేలైన్ క్రాసింగ్ రెండు కి.మీ. ముందునుంచే మొదలవుతుంది. దీంతో రోడ్డు--రైలు లైను మధ్య సమన్వయం సాధ్యం కాదు. సాంకేతికంగా సమస్యలు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో దూరదూరంగానే నిర్మించాల్సి ఉంటుందన్న నిపుణుల సూచన మేరకు అలైన్‌మెంట్‌లో మార్పుచేర్పుల అంశాన్ని పరిశీలిస్తున్నారు. పక్కపక్కనే నిర్మించినా, దూరంగా నిర్మించినా, భూసేకరణ అనేది పెద్ద సవాల్‌గా మారనుంది.

ఇప్పటికే రింగురోడ్డుకు భూములు ఇచ్చిన రైతులు మళ్లీ రింగురైలుకు భూములు ఇచ్చేందుకు ససేమిరా అనే అవకాశమే ఎక్కువగా ఉంది. యాదాద్రి తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి విస్తరణకు, ఇతర సాగునీటి ప్రాజెక్టు కాలువలకు ఇప్పటికే రెండుమూడు పర్యాయాలు భూములు ఇచ్చిన రైతులు, రీజినల్ రింగురోడ్డుకు ఇచ్చేందుకు ససేమిరా అని కోర్టుల్లో కేసులు వేశారు. ఆయా ప్రాంతాల్లో మళ్లీ రింగురైలుకు భూములు ఇచ్చేందుకు వారు సహకరించే వీలు లేదు. ఇటు రోడ్డు--అటు రైల్వే లైను మధ్యలో ఉండే భూములకు విలువ తగ్గిపోతుంది. దీన్ని కూడా ఆయా రైతులు వ్యతిరేకించే అవకాశముంది. వెరసి ఈ ప్రాజెక్టు విషయంలో తీవ్ర అయోమయం నెలకొంది.

# భూముల ధరలు పెంచిన ప్రభుత్వం
# జూన్ 5 నుంచి అమలు

రాష్ట్ర ప్రభుత్వం భూముల ధరలు పెంచింది. ఈ నిర్ణయం ఈనెల 5 నుంచి అమల్లోకి వస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. హేతుబద్ధంగా, శాస్త్రీయంగా క్షేత్రస్థాయి అధ్యయనం తర్వాతే భూముల కొత్త విలువలపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక నిపుణులు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక మేరకు విస్తృత అధ్యయనం చేశామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతుల్లో 2021, 22 సంవత్సరాలల్లో కేవలం 6 నెలల వ్యవధిలోనే రెండు సార్లు భూముల ధరలను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచిందని మంత్రి పొంగులేటి గుర్తుచేశారు.

### సీఎం ఆలోచనతో నిర్ణయం

రాష్ట్రంలో భూముల విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల విశ్లేషణ ఆధారంగా కొత్త విలువలను నిర్ణయించామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

### స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నిర్ణయం

భూ లావాదేవీల విషయంలో అనేక సమస్యలు ఏర్పుతున్నట్లు ప్రభుత్వం గుర్తించిందని ఈ సమస్యల పరిష్కారానికే రాష్ట్రవ్యాప్తంగా పునర్విమర్శ చేపట్టామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. రాష్ట్రంలోని 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల సమీక్ష నిర్వహించామని అన్నారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేశాయని తెలిపారు.

### ఆ ప్రాంతాల్లో ఎలాంటి పెంపు లేదు

అభివృద్ధి సామర్థ్యం, భూముల డిమాండ్, వేలాలు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కొత్త రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఫ్లాట్ల



విషయంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు అమలు చేశామని అన్నారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదన లేదని వివరించారు.

ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని రేట్లు ఖరారు : హెచ్ఎండీఏ, సీయూఆర్ఈ పరిధి, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించామని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస రేట్లు ఖరారు చేశామని వెల్లడించారు. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించకపోవడంతో కొత్త రేట్ల అవసరం ఏర్పడిందన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాల పెరుగుదలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించామని వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకతతో ఈ సవరణలు చేపట్టామని అన్నారు. దీని ద్వారా భూ లావాదేవీలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందని వెల్లడించారు.

### బీఆర్ఎస్‌పై విమర్శల వర్షం

ఈ భూముల విలువల సవరణలో భాగంగా ప్రాంతాల వారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను పరిశీలించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శాస్త్రీయ అధ్యయనం లేకుండా భూముల ధరలను పెంచిందని విమర్శించారు. 2021-22లో ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు భూముల విలువలు పెంచారని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. గత ప్రభుత్వ సవరణల్లో కొన్ని చోట్ల మార్కెట్ ధరల కంటే తక్కువ, మరికొన్ని చోట్ల ఎక్కువగా విలువలను నిర్ణయించారని చెప్పుకొచ్చారు.

## రాష్ట్రంలో 2 రోజులపాటు భారీ వర్షాలు



తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ, రేపు పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో ఇవాళ రేపు ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

### ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు

ఉమ్మడి ఆదిలాబాద్ పాటు కుమురంభీం ఆసిఫాబాద్?, నిర్మల్?, మంచిర్యాల, నిజామాబాద్?, జగిత్యాల, కరీంనగర్?, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ములుగు, జయశంకర్? భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, హనుమకొండ, వరంగల్? జిల్లాలకు ఆరెంజ్? అలర్ట్ హెచ్చరికలు? ?జారీ చేసింది. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్?తో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. రేపు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ తో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు, ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

### ఆ రెండు రాష్ట్రాలను నైరుతి రుతుపవనాలు తాకే అవకాశాలు

గురువారానికి కేరళ, తమిళనాడులను నైరుతి రుతుపవనాలు తాకే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. మంగళవారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో 7.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలోని తల్లాడలో 6 సెం.మీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట 4 సెం.మీ, దమ్మపేట 3 సెం.మీ, ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో 1.7 సెం.మీ వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా 27 జిల్లాలో 40.2 - 44.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## సభ పెట్టుకోవడం అనేది నా హక్కు దాన్ని కాదనకూడదు

-మొదటిపేజీ తరువాయి

కాదనకూడదని తెలిపారు. రాష్ట్ర విభజనకు నేను ఎప్పుడూ వ్యతిరేకం కాదని మరోసారి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్వేషాలు రగల్చడం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మంచిది కాదని, కాంగ్రెస్ అగ్రనేతలు దేశ సమగ్రత గురించి మాట్లాడాలని హితవు పలికారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ఏం నేర్చుకున్నారని ప్రశ్నించారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే వారు ప్రజలకు ఏం సందేశం ఇస్తారని నిలదీశారు. తెలంగాణ, తమిళనాడులో ప్రాంతీయ భావం ఉందని, ఏపీ ప్రజల్లో ఉన్న ఉప ప్రాంతీయవాదం సరికాదని వెల్లడించారు.

### తెలంగాణ జాగీరే

తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ తనకు సోదరుడితో సమానమన్న పవన్ కల్యాణ్ కేటీఆర్ ఏమన్నారో తాను వినలేదని తెలిపారు. తనకు తెలిసి కేటీఆర్ తప్పుగా మాట్లాడరని, తాము కలిసినప్పుడు ఈ అంశంపై సరదాగా మాట్లాడుకుంటామని అన్నారు. తెలంగాణ భూమి పుత్రుల జాగీరే అని స్పష్టం చేశారు.

"నా సభకు అనుమతి ఇవ్వడం చిన్న విషయం ఇస్తే గొడవే వచ్చేది కాదు. హైదరాబాద్‌లో నాకు ఇల్లు ఉంది. అక్కడ ఉండటం సాధారణం. సభ పెట్టుకోవడం అనేది నా హక్కు. దాన్ని కాదనకూడదు. రాష్ట్ర విభజనకు నేను ఎప్పుడూ వ్యతిరేకం కాదు ప్రాంతీయ విద్వేషాలు రగల్చడం రాహుల్‌గాంధీకి మంచిది కాదు. కాంగ్రెస్ అగ్రనేతలు దేశ సమగ్రత గురించి మాట్లాడాలి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ఏం నేర్చుకున్నారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే వారు ప్రజలకు ఏం సందేశం ఇస్తారు?. తెలంగాణ, తమిళనాడులో ప్రాంతీయ భావం ఉంది. ఏపీ ప్రజల్లో ఉన్న ఉప ప్రాంతీయవాదం సరికాదు"

తెలంగాణకు ఓ నినాదం, భావోద్వేగం ఉన్నాయి : పొట్టి శ్రీరాములు త్యాగం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు దారితీసిందని గుర్తు చేశారు. మహానాయకులను కులచట్రాల్లో బిగించడం రాజకీయాల్లో అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు బలిదానం కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు ఉనికి ఏర్పడిందని, తెలంగాణకు ఓ నినాదం, భావోద్వేగం ఉన్నాయని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో నా ఆంధ్ర అన్న భావోద్వేగం లేదని తెలిపారు. 1998 నుంచి 2004 వరకూ రాజకీయాల్లో కులదూషణలు ఎక్కువయ్యాయని, ఏపీలో వైఎస్సార్సీపీ వచ్చాక కులదూషణలు మరీ ఎక్కువయ్యాయని అసహనం వ్యక్తం చేశారు.

### జనసేన తరఫున సేనాగళం ఏర్పాటు

జనసేన మూలసిద్ధాంతాల్లో కులాల ఐక్యత ఒకటి అని గుర్తు చేశారు. కులదూషణ వైఖరి ఇలాగే పెరిగితే పరిపాలన కూడా కష్టమవుతుందని అన్నారు. అధికారం కోల్పోయాక వైఎస్సార్సీపీ మరీ బరితెగించిందని, కులదూషణ వైఖరికి చరమగీతం పాడాలని జనసేన నిర్ణయించిందని స్పష్టం చేశారు. కొందరు ఇష్టారాజ్యంగా తిట్టేసి కులాల ముసుగులో దాక్కుంటున్నారని, జనసేన తరఫున సేనాగళం ఏర్పాటు చేశామని వెల్లడించారు.

## డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్

-మొదటిపేజీ తరువాయి

వస్తున్నారని రేవంత్ తెలిపారు. నగరాన్ని ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో దక్షిణాఫ్రికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో 30 వేల ఎకరాల్లో పర్యావరణ హితంగా, నెట్ జీరో టెక్నాలజీతో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. భవిష్యత్ పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, పరిశోధనలకు ఇది కేంద్రంగా మారుతుందని వివరించారు.

### పెట్టుబడులకు అనుకూలం: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ కలిగిన రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల పరిస్థితులున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు చెప్పారు. బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు.

### రెండు దేశాలదీ చారిత్రక బంధం: పాల్ మషాటిలే

వచ్చే డిసెంబర్‌లో జరిగే సమ్మిట్--2026కు తమ దేశ ప్రతినిధుల బృందంతో కలిసి పాల్గొంటామని మషాటిలే తెలిపారు. ఈ సదస్సుతో ఇరు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు బలోపేతమవుతాయని అభిప్రాయపడ్డారు. భారతదేశం, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని, దశాబ్దాలుగా బలమైన సాంస్కృతిక సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని, భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో దక్షిణాఫ్రికా అంతర్జాతీయ సంబంధాల ఉప మంత్రి మొరాకాతో పాటు పలువురు మంత్రులు, దక్షిణాఫ్రికాలో భారత రాయబారి ఎ.సూక్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## సిగ్నల్స్ వద్ద ఇంజిన్ ఆపేస్తే సరి
## 25 శాతానికి పైగా కాలుష్యాన్ని తగ్గించినట్లే!

రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలు వాయుకాలుష్యానికి కారణంగా నిలుస్తున్నాయి. హైదరాబాద్? మహానగరంలో రోజుకు సుమారు 1500 నుంచి 2 వేల వరకు కొత్త వాహనాలు రోడ్డెక్కుతుంటాయి. మూడు జిల్లాల్లో మొత్తం దాదాపు 90 లక్షల వాహనాలు ఉన్నాయని ఆర్టీఏ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాజధాని నగరంలో రోజు రోజుకూ వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతూ వస్తోంది. దీనికి తగ్గట్టుగానే కాలుష్య ఉద్గారాలూ పెరుగుతున్నాయి. నగరంలో రద్దీ ప్రదేశాల్లోని కూడళ్ల వద్ద సిగ్నల్? కారణంగా వాహనాలను నిలపాల్సి వస్తుంది. ఇక్కడ అనేక మంది వాహనాలు ఇంజిన్ ఆఫ్ చేయకుండా అధిక సమయం ఉంటున్నారు. ట్రాఫిక్ వల్ల ప్రయాణించే సమయమూ పెరుగుతోంది. ఇలా అనేక కారణాల వలన ఉద్గారాలస్థాయి మరింతగా పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా అవుటర్ పరిధిలో రోజుకు 4097 కేజీలు, గ్రేటర్ పరిధిలో 3035 కేజీల ఉద్గారాలు వెలువడుతున్నాయి. ఈ విషయాలను 'సోర్స్ ఆఫ్ ఆపోర్షన్‌మెంట్ స్టడీ, ఎమిషన్ ఇన్వెంటరీ అండ్ క్యారియింగ్ కెపాసిటీ ఫర్ హైదరాబాద్ సిటీ' అధ్యయనం వెల్లడించింది.

### ఈ నియమాలు పాటిస్తే కాస్త ఉపశమనం

ట్రాఫిక్ కూడళ్లలో సిగ్నళ్ల వద్ద వేచి ఉండాల్సిన సమయం 10 నుంచి 15 సెకన్ల కంటే అధికంగా ఉంటే తక్షణమే ఇంజిన్?ను ఆఫ్ చేయాలి. మల్టీడ్రైవ్ మోడ్స్ ఉన్న కార్లలో ఎకోమోడ్‌ను ఉపయోగించాలి. దీంతో ఇంధన వినియోగం చాలా వరకు తగ్గుతుంది. కొత్త మోడల్? బైక్‌లు, కార్లలో ఐడిల్ స్టార్ట్- స్టాప్ ఫీచర్ ఉంటుంది. వీటిని ఎప్పుడూ ఆన్‌లో ఉంచాలి. వాహనం ఆగగానే ఇది స్వయంగా ఇంజిన్‌ను ఆఫ్ చేస్తుంది.

### 25 శాతానికి పైగా కాలుష్యం ఇక్కడే

హైదరాబాద్?లోని సాధారణ ప్రదేశాలతో పోల్చితే ఒక్కో సిగ్నల్ ప్రాంతం వద్ద 25 శాతానికి పైగా కాలుష్యం వెలువడుతోంది. ఇలా రోజుకు 1500 టన్నుల ఉద్గారాలు పోగవుతున్నాయి. అనవసరంగా ఇంజిన్ ఆన్‌లోనే ఉంచడంతో హైడ్రోకార్బన్లు, కార్బన్ డయాక్సైడ్, సీసం వంటి ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ గాలి పీల్చడంతో క్యాన్సర్, శ్వాసకోశ సమస్యలు వంటి రోగాల బారి పడే ప్రమాదం పొంచి ఉంది.

### ప్రధాన కూడళ్లలో 3 నిమిషాల సమయం

గ్రేటర్ పరిధిలో దాదాపు 1400 పైగా జంక్షన్లు ఉన్నాయి. వాటిలో 30 సెకన్ల కంటే ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. నగరంలోని ప్రధాన కూడళ్లలో అయితే ఏకంగా 2 నుంచి 3 నిమిషాల సమయం పడుతోంది. ఇలా ఒక్క సిగ్నల్ వద్ద రోడ్డుకు నలువైపులా 300కి పైగా వాహనాలు నిలుస్తున్నాయి. ఒక్కో వాహనం 40 పీపీఎం చొప్పున కార్బన్ డయాక్సైడ్ వాయువును విడుదల చేస్తున్నాయి. వాయుకాలుష్యానికి కారణమవుతున్నాయి. ఇలాంటి సమస్యలను తగ్గించుకునేందుకు ప్రభుత్వం పలు సూచనలు చేసింది. వాహనాలు అధిక సంఖ్యలో తిరగటంతో వాయు కాలుష్యంతో పాటు ట్రాఫిక్?కూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యంగా హైటెక్? సిటీ, మాదాపూర్?, ఫైనాన్షియల్? డిస్ట్రిక్ట్, కొండాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా హైటెక్? సిటీ, సైబరాబాద్, గచ్చిబౌలి, మైండ్‌స్పేస్ ప్రాంతాల్లో బైక్ షేరింగ్, కార్ పూలింగ్? లేదా ప్రజారవాణా వ్యవస్థలైన ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించి ప్రయాణాలు సాగించాలని పోలీసులు సూచిస్తున్నారు.

## సంపాదకీయం

# విద్యార్థుల జీవితాలతో ఆటలా...

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 12వ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అనేక లోపాలు, తేడాలు బయటపడడం దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్ సంఘటన మరువక ముందే సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు వివాదాస్పద చర్చకు దారితీస్తున్నాయి. సిబిఎస్ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వల్లనే ఈ గందరగోళం ఏర్పడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విద్యార్థుల పునఃమూల్యాంకన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో తమ పోర్టల్‌పై భారీ సైబర్ దాడికి ప్రయత్నాలు జరిగాయని సీబీఎస్ఈ ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 16 వేల మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొంది. ఈ సమయంలోనే కొందరు డినయల్-ఆఫ్-సర్వీస్ అనే విధానంతో పోర్టల్‌పై దాడికి ప్రయత్నించారని, దీని వల్ల 2 నిమిషాల్లోనే దాదాపు 15 లక్షల మంది లాగిన్ అవ్వడానికి ప్రయత్నించారని తెలిపింది. అనధికారికంగా పోర్టల్‌లోకి చొరబడేందుకు లక్షకుపైగా సైబర్‌దాడుల ప్రయత్నాలు జరిగినట్లు తమ భద్రత వ్యవస్థ గుర్తించిందని వివరించింది. అయితే, ఈ సైబర్ దాడులను సమర్థంగా అడ్డుకున్నామని, ప్రస్తుతం పోర్టల్ పనిచేస్తూనే ఉందని చెప్పింది. విద్యార్థుల రీవేల్యూషన్ దరఖాస్తులను ప్రాసెస్ జరుగుతోందని తెలిపింది. ఒకేసారి 8,000 మందికిపైగా స్టూడెంట్లు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చిన వెల్లడించింది. టెక్నికల్ టీమ్‌లు ఈ ప్లాట్‌ఫామ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని.. ఏదైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే స్పందిస్తున్నాయని పేర్కొంది. విద్యార్థులకు ఎటువంటి అంతరాయం లేకుండా సేవలను అందించేందుకు తమ బృందాలు కృషి చేస్తున్నాయని సీబీఎస్ఈ పేర్కొంది. ప్లస్‌టూ లో సీబీఎస్ఈ కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం కారణంగా తమ జవాబు పత్రాలు తారుమారయ్యాయంటూ కొందరు విద్యార్థులు ఆందోళనలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర దుమారం రేగడంతో సీబీఎస్ఈ స్పందించింది. సమాధాన పత్రాల స్కానింగ్ కాపీలను విద్యార్థులకు అందిస్తామని, వాటిని పరిశీలించిన తర్వాత రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పునఃమూల్యాంకనం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునే పోర్టల్‌పైనే తాజాగా సైబర్ దాడి జరిగినట్లు వెల్లడించింది. జాతీయ స్థాయి పరీక్షలైన క్యూట్‌యుజి వల్ల విద్యార్థులు వేర్వేరు విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా ఎంట్రన్స్ పరీక్షలు రాయవలసిన అవసరం లేకుండా ఒకే పరీక్ష ద్వారా దేశంలోని అత్యుత్తమ యూనివర్సిటీల్లో సీట్లు పొందగలుగుతారు. అయితే క్యూట్‌లో ఎదురవుతున్న సాంకేతిక లోపాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, సిబిఎస్ఇల్లో పదేపదే జరుగుతూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే ఉత్తీర్ణత శాతం గత ఏడాది 88.39 శాతం ఉండగా, ఈ ఏడాది 85.29 శాతానికి దిగజారింది. 90 శాతం కన్నా స్కోరు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా బాగా తగ్గింది. దీంతో చాలా మంది విద్యార్థులు తాము ఆశించిన విధంగా ఫలితాలు రాకపోవడంతో మూల్యాంకనం కోసం ఆశ్రయించారు. 4 లక్షలకు మించి విద్యార్థులు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలు కావాలని అభ్యర్థించారంటే ఎంత మంది ఈ ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారో తెలుస్తోంది. ఫిబ్రవరి 17న ఈ 12వ తరగతి పరీక్షలు జరగ్గా, ఈ పరీక్షలకు కేవలం పదిరోజులకు ముందుగా ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ అమలు గురించి ఉపాధ్యాయులకు తెలియజేయడం విడ్డూరం. ఈ కొత్త పద్ధతిపై ఉపాధ్యాయులకు ఎంతవరకు అవగాహన ఉంది? వారు స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను డిజిటల్ ప్రక్రియలో దిద్దగలరా? స్కానింగ్ కాపీలు స్పష్టంగా ఉంటున్నాయా? ఇవేవీ పరిశీలించకుండానే హడావిడిగా అమలు చేయడం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కూడా ఇదో అగ్నిపరీక్షగా తయారై అనేక లోపాలు పుట్టుకొచ్చాయి. ఫిబ్రవరి 9న సిబిఎస్ఇ జారీ చేసిన సర్కులర్‌లో ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించింది. విద్యా సంస్కరణల్లో నూతన అధ్యాయం తప్పులు పూర్తిగా తొలగించవచ్చని, మానవ సహాయం చాలావరకు తగ్గుతుందని, మూల్యాంకనం అంటే పేపర్లు దిద్దడం చాలా వేగంగా జరుగుతుందని, ఫలితాలు వెలువడిన తరువాత తిరిగి పరిశీలించవలసిన అవసరం రాదని ఇలా ఎన్నెన్నో పేర్కొంది. కానీ ఆచరణాత్మకం వాటికి భిన్నంగా ఫలితాలు కనిపించాయి. 17 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. అంటే వీరికి 98 లక్షల జవాబు పత్రాల పుస్తకాలు అందించారు. అంటే 40 కోట్ల పేజీలు ఇచ్చినట్టు. ఇవన్నీ మాన్యువల్‌గా రికార్డు సమయానికి స్కానింగ్ చేయవలసి ఉంటుంది. మూల్యాంకనం కోరిన వారికి ఇవన్నీ పరిశీలించవలసి ఉంటుంది. దీనికి తగిన కనీస మౌలిక అవసరాలు, కంప్యూటర్లు, లాకింగ్ సిస్టమ్ తదితర సాంకేతికత సరిగ్గా లేక గందరగోళం ఏర్పడి తప్పుల కుప్పలు కనిపిస్తున్నాయి. అంటే సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉందో స్పష్టమవుతోంది. స్కానింగ్ వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి రాకుండా ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియను ఎందుకు సిబిఎస్ఇ ప్రవేశపెట్టిందో అర్థంకావడం లేదు. ఇది క్షమించరానిది. ఇది తాత్కాలిక సర్దుబాటుగా సిబిఎస్ఇ చెబుతున్నా సక్రమంగా అంతవరకు ఉన్న వ్యవస్థను నాశనం చేసినట్టే. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ లోపాలపై ఎవరు దర్యాప్తు చేస్తారు? లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థ వల్ల మూల్యాంకనం తప్పులు, అక్రమాల పుట్టగా తయారైందని ధ్వజమెత్తారు. సిబిఎస్ఇ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే, దానికి మీకు బిల్లుపడుతుందన్నారు. డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్టుకు రూ. 100, ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ. 100, రీ ఎవాల్యుయేషన్ చేయించుకోవాలంటే ఒక ప్రశ్నకు రూ. 25, మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబు పత్రాన్ని సరిగ్గా దిద్దించుకోవడానికి దాదాపు రూ. 2000 చెల్లించవలసి రావచ్చన్నారు. మొత్తం 4 లక్షల మంది విద్యార్థులు మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు సిబిఎస్ఇ ఎంత సొమ్ము ఆర్జిస్తోందో గమనించాలని విద్యార్థులకు సూచించారు. ఇదంతా శిక్ష పడుతున్నది విద్యార్థులకు, ఆదాయం ప్రభుత్వానికి అని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా ఈ పరీక్షల నిర్వహణకు ఎడ్యుటెక్ అనే సంస్థను సిబిఎస్ఇ ఎంపిక చేయడాన్ని ఆక్షేపించారు. తెలంగాణలో గ్లోబరేనా అనే పేరుతో ఈ సంస్థ 2019, 2023లో స్కామ్‌కు పాల్పడిందని, అలాంటి రికార్డు ఉన్న సంగతి సిబిఎస్ఇకి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ కంపెనీ రికార్డు తెలిసినా దీన్ని ఎంచుకోవడంలో ఏదో నిగూఢమైన కారణం ఉందని ఆరోపించారు. అయితే ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ ప్రకారమే ఈ కంపెనీని ఎంపిక చేసినట్టు సిబిఎస్ఇ వెల్లడించింది. అయితే జవాబు పత్రాల మూల్యాంకన పోర్టల్‌లోని లోపాలను వినియోగదారులు బయటపెట్టడంతో సిబిఎస్ఇ వాటిని అంగీకరించడమే కాక, ఈ కంపెనీపై జరిమానా విధించడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. విద్యార్థులు తమ బాల్యం లోని మంచి దశను, వారి ఆత్మస్థైర్యాన్ని నాశనం చేసే బోర్డు, ప్రవేశ పరీక్షల కోసం త్యాగం చేయవలసి వస్తోందని పరీక్షల నిర్వాహకులు తెలుసుకోవాలి. యువత తమ కెరీర్, ఉన్నత చదువుల కోసం రాసే ఈ ప్రవేశ పరీక్షల ఒత్తిడి, పోటీ కారణంగా వారు స్వేచ్ఛను కోల్పోయి, పరీక్షలకే పరిమితమవుతున్నారు. ఇది విద్యార్థి తరానికి జరిగిన ఒక బాధాకరమైన, నిరాశపరిచే నమ్మకద్రోహం.

# నైరాశ్య యువత నవీన తిరుగుబాటు

'మాట మాటకు మందు దూరంలా/ మేం సాగుతాం/ మేం రేగుతాం'.. అంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ/ బొద్దింకల జనతా పార్టీ) 'ఝుంఝూనిల షడ్జధ్వానం' చేసింది. సీజేపీ ఒక డిజిటల్ దృగ్విషయం. నిరుద్యోగ యువతను 'పరాన్న జీవులు', 'బొద్దింకలు'తో పోలుస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రజ్వరిల్లిన ఆన్‌లైన్ ధిక్కారమది. కనుకనే అపూర్వ సంచలనం సృష్టించింది. అయితే ఆ సంచలనానికి ప్రతిస్పందనలు చాలావరకు స్పష్టంగా కనిపిస్తున్న ఒక సామాన్య సత్యాన్ని గమనించనే లేదు! సీజేపీ ఒక సంప్రదాయ రాజకీయ పార్టీ కాదు. అది ప్రజానీకం కంటే ఎక్కువా కాదు, తక్కువా కాదు. అది ఒక సమాజమూ కాదు. ఒక గుంపు కూడా కాదు, అదొక భావోద్వేగాల సముదాయం. ఒక ఉద్యమ స్థాయికి చాలా చాలా దూరంగా ఉన్నది. అది కేవలం ఒక ప్రభంజన సందర్భం. ఎటువంటి ప్రభంజనమది? 'ఒక్క క్షణంలో/ మనస్సులో స్మృతి/ తటిన్మణి'పించిన ప్రభంజనమది. 'మతి వికాసిస్తుంది' సందేహం లేదు. అధికార నియంతృత్వ దాడి నుంచి మన ప్రజాస్వామిక గణతంత్రాన్ని కాపాడుకోవాల్సిన కర్తవ్యాన్ని నిర్దేశించడమే కాకుండా అందుకు అవసరమైన సంకల్పశక్తిని సమకూర్చిన ప్రభంజన క్షణమది. అందుకే అది ముఖ్యమైనది. ఎట్టి పరిస్థితులలోనూ కొట్టివేయకూడనిది. అలా చేయడమంటే దేశ రాజకీయ వాస్తవాలను విస్మరించడమే అవుతుంది. ఆ ప్రభంజనం ఒక అల కాదు, ఒక రాజకీయ అంతర్వాహిని, ఆగ్రహ రాజకీయ అంతర్వాహిని (అల అనేది పెద్ద శబ్దంతో, కంటికి కనిపించేదిగా, తాత్కాలికమైనదిగా ఉంటుంది. అది త్వరగా విరుచుకుపడి, అంతరిస్తుంది. అలకు భిన్నంగా అంతర్వాహిని అనేది ఉపరితలం కింద నుంచి ప్రభావం చూపే శక్తిమంతమైన, నిశ్శబ్దమైన, స్థిరమైన కదలిక). ప్రాకృతిక ప్రభంజనాలనే కాదు, రాజకీయ, సామాజిక ప్రభంజనాలనూ పట్టుకోవడమనేది అసాధ్యం. సీజేపీ అనే ప్రభంజనాన్ని నియంత్రించాలనేది ఒక మూర్ఖపు ఆలోచన. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఆ ప్రభంజనం దేశ రాజకీయ వాతావరణంలో, పాలనా వ్యవస్థలో ఒక మౌలిక మార్పును ఆశించింది. అటువంటి మార్పును అడ్డుకోవడానికి మొండిగా ప్రయత్నించడం వివేకవంతం కానేకాదు.



భారీ మెజారిటీతో అధికారానికి వచ్చిన ప్రభుత్వాలు తమ పదవీ మధ్యకాలంలో సంక్షోభాల పాలవడం ఒక సాధారణ రాజకీయ పరిణామం. ఊహించని రీతిలో నిరసనోద్యమాలు ప్రజ్వరిల్లి అధికారపు చీకటి కోణాన్ని బహిర్గతం చేస్తాయి. 1973--74లో గుజరాత్, బిహార్ ఉద్యమాలు, 1983లో అసోం ఉద్యమం, 2012లో అన్నాహజారే ఉద్యమం, 2021లో కిసాన్ మోర్చా ఉద్యమం మొదలైనవన్నీ అజేయంగా కన్పించిన ప్రభుత్వాలను సవాల్ చేశాయి.. మార్పును సాధించాయి. ప్రతిపక్షాలు నిస్తేజం కావడంతో విద్యార్థులు, యువజనుల చొరవతో ఆ ఉద్యమాలు నిర్వహించి మార్పులు సాధించారు. ఆశయం దృష్ట్యా కాక్రోచ్ జనతా పార్టీ సంచలనం కూడా తొలి పరిశీలనలో అదే రీతి ఉద్యమంగా కన్పిస్తోంది. ఈ 'బొద్దింకల' ఉద్యమం అపూర్వ ప్రజా చైతన్యాన్ని సృష్టించడంలో చారిత్రకంగా ఇతర సమాంతర ఉద్యమాల కంటే మరింత ప్రభావశీలమైనది. అయితే ఆచరణీయమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రభవింపజేసేందుకు అవసరమైన శక్తిసామర్థ్యాలు దానికి కొరవడ్డాయి. ఎందుకని? ఈ డిజిటల్ ప్రతిఘటనలో పాల్గొన్నవారు చాలావరకు నిజ జీవిత రాజకీయ కార్యాచరణలో పాల్గొనడానికి సంసిద్ధంగా ఉన్న కార్యకర్తలు కారు. కాక్రోచ్ జనతా పార్టీ ప్రారంభదశలో ఉన్నది. ప్రభావవంతమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని సృష్టించగల స్థితికి చాలా దూరంలో ఉన్నది. దానికొక సంస్థాపకుడు ఉన్నాడు. అయితే ఆ వ్యవస్థాపకుడు విధిగా ఒక ఆవశ్యక నాయకుడు కాదు. సీజేపీ అనుయాయుల్లో అత్యధికులు కేవలం ప్రేక్షకులు మాత్రమే. ఆందోళనల్లో అనుభవం లేనివారు. కేవలం ఉత్సాహం ఉంటే సరిపోతుందా? నిజ జీవితంలో రాజకీయ కార్యాచరణ కష్టనష్టాలను భరించి లక్ష్యసాధనకు కడదాకా సాగేందుకు సంకల్పించుకునేవారు ఎంతమంది ఉంటారు? పైగా వారు ఒక అనిర్దిష్ట విరోధికి వ్యతిరేకంగా పరస్పర విరుద్ధమైన ఫిర్యాదులు చేస్తున్నారు. ఉమ్మడిగా ఎదుర్కొంటున్న సమస్యలపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే అవన్నీ ప్రజాస్వామ్య డిమాండ్లు, సందేహం లేదు. పాలకులు వాటిని విస్మరించినప్పుడు (ఇదే జరిగి తీరుతుంది) ఆందోళనకారులు తమ ఉమ్మడి శత్రువును గుర్తిస్తారు. వారి ఫిర్యాదులు ప్రజా డిమాండ్లుగా పరిణమిస్తాయి. సీజేపీ వంటి ప్రతి ప్రజా నిరసనోద్యమపు విశిష్ట లక్షణమది. ఆ ప్రత్యేకతే శక్తిమంతమైన, కార్యసాధక ఉద్యమాల నిర్మాణానికి అవసరమైన ప్రాతిపదికలను నిర్మిస్తుందని అర్జెంటీనా రాజకీయ తత్వవేత్త ఎర్నెస్టో లాక్లా (1935--2014) అన్నారు. నిరంకుశాధికార తత్వం అంతకంతకూ పెరిగిపోతున్న నేపథ్యంలో దానిని ఎదుర్కొనేందుకు 'సందిగ్ధ చర్య' (డైలమా యాక్షన్) మార్గాన్ని ఎంచుకోవడం సీజేపీకి మరింత విశిష్టతను సమకూర్చింది. నియంతృత్వ పాలకులను అహింసాత్మకంగా ప్రతిఘటించడంలో హాస్యం, ముందుగా ఊహించవీలులేని పద్ధతిని అనుసరించడం చాలా కీలకమని సెర్బియన్ మేధావి, క్రియాశీలి పోపోవిక్ వాదిస్తారు. సోఫియా ఎ.మెక్ క్లెనెన్‌తో కలిసి ఆమె రాసిన 'ప్రాంక్‌స్టర్స్ వర్సెస్ ఆటోక్రాట్స్' అనే పుస్తకం నిరంకుశ ప్రభుత్వాలను ప్రతిఘటించేందుకు ప్రజా నిరసనోద్యమాలు హాస్యాన్ని, సందిగ్ధ చర్యలను ఉపయోగించుకున్న తీరుతెన్నులను విపులంగా వివరించారు. అటువంటి నిరసనోద్యమాలు నిరంకుశ పాలకులను సందిగ్ధంలో పడవేస్తాయి. ఎదుర్కోలేని సంకటాలను కలిగిస్తాయి. ఉద్యమకారుల సందిగ్ధ చర్యలను అనుమతిస్తే పాలకులు బలహీనులుగా కనిపిస్తారు. వాటిని అణచివేసిన పక్షంలో ప్రజల దృష్టిలో క్రూర, అసంబద్ధ పాలకులుగా నిలుస్తారు. సంప్రదాయ ప్రతిపక్షాలు విఫలమైన చోట ఈ వినూత్న నిరసనలు ప్రభావశీలంగా సఫలమవడం కద్దు. నిరంకుశాధికార పాలనపై పోరుకు బొద్దింకను ఒక మీమ్‌గా చేసిన కాక్రోచ్ జనతా పార్టీని అందుకొక స్పష్టమైన నిదర్శనంగా చెప్పవచ్చు. మన ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ప్రజాస్వామిక ప్రతిఘటనకు సీజేపీ, బహుశా అనుద్దేశపూర్వకంగానే ఒక ఆదర్శప్రాయ సందిగ్ధ చర్యను ప్రతిపాదించింది. 'బొద్దింకల ఉద్యమం' ఒక వినూత్న నిరసన రీతి. అంతేకాదు, అది వర్తమాన భారతదేశ రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టింది. పాలకుల పట్ల ప్రజల్లో ముఖ్యంగా యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తిని అది వ్యక్తం చేసింది. జాతీయ అధికార పక్షం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయాలు సాధిస్తూ మరింతగా బలోపేతమవుతోన్నది. ఆ విజయాల గురించి ఆ అధికారపక్షం ఎంతగా గొప్పలకు పోయినా తమ జీవనోపాధుల భద్రత విషయమై ప్రజలు అమితంగా ఆందోళన చెందుతున్నారు. అలాగే తమ భవిష్యత్తు పట్ల యువ భారతీయులు వ్యాకులత అంతా ఇంతా కాదు. ఇవి ఘోర వాస్తవాలని సీజేపీ స్పష్టం చేసింది. సర్వశక్తిమంతమైన ప్రభుత్వం ఒక మీమ్‌ను నిషేధించేందుకు జాతీయ భద్రతను కారణంగా చూడడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సామాజిక మాధ్యమాల్లో ఒక విషయమై విశేషంగా వెల్లువెత్తుతున్న అభిప్రాయాలను అపఖ్యాతిపాలు చేసేందుకు ట్రోల్ ఆర్మీ (ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేయడానికి రూపొందించబడిన సోషల్ మీడియా ఖాతాల వ్యవస్థీకృత సమూహం)ను మోహరించాల్సిన అవసరమేమిటి? సీజేపీ విషయంలో ఇలా జరిగిందంటే ప్రభుత్వం కనిపిస్తున్నంత బలంగా లేదనే కాదూ? కాకపోతే ఒక మీమ్‌కు భయపడడమేమిటి? ఎంతగా విజయాలు సాధిస్తుందో అంతగా ఆత్మరక్షణ చేసుకోవల్సిన పరిస్థితులనూ ఎదుర్కొంటున్నదని స్పష్టంగా చెప్పవచ్చు. విచారకరమైన విషయమేమిటంటే పార్లమెంటరీ ప్రతిపక్షం దుస్థితి. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకోవడంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమవుతున్నది. సీజేపీకి కొద్ది రోజుల్లోనే ఇంచుమించు రెండున్నర కోట్ల మంది అనుయాయులు సమకూరడమనేది ప్రతిపక్షాలకు ఒక సందేశాన్నిస్తోంది: సంఘటితమై సమైక్యంగా ప్రభావశీల కార్యాచరణకు పూనుకోవాలి. ఇది జరిగినప్పుడు మాత్రమే ప్రజలు ప్రతిపక్షాలను విశ్వసిస్తారు. ఈ వాస్తవాల దృష్ట్యా కాక్రోచ్ జనతా పార్టీ పట్ల మనం ఎలా ప్రతిస్పందించాలి? రాజకీయ నిరాశావాదం, వ్యూహాత్మకంగా విస్మరించడం లేదా సమాదరించడం ఇత్యాది సాధారణ రీతుల్లో కాకుండా ఒక కొత్త దృక్పథంతో ఆ వినూత్న రాజకీయ శక్తిని చూడాలి. సర్వవ్యాప్త నైరాశ్యాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన రాజకీయ సంఘీభావానికి ఒక కొత్త వ్యాకరణాన్ని రూపొందించుకోవాలని కవి వినోద్‌కుమార్ శుక్లా (1937--2025) మనకు ఇలా పిలుపునిచ్చారు: 'మేము కలిసి నడిచాము/ మాలో ఎవరికీ ఒకరి గురించి ఒకరికి తెలియదు/ కలిసి నడవడమంటే ఏమిటో మాత్రమే మాకు తెలుసు'. ఇది విప్లవోద్యమ సహచరుల పరస్పర సాన్నిహిత్యం కాదు.. అపరిచితుల సాహచర్యం. ఇది ఉమ్మడి గుర్తింపు అనుబంధం కాదు, ఉమ్మడి బలహీనతలను పంచుకునే మానవీయ చైతన్యశీల బంధం. బొద్దింకలుగా ఉద్యమించిన యువజనులకు మనం తెలియకపోవచ్చు. అయితే మనం చాచిన చేతిని వారు తప్పక గుర్తిస్తారు, అందుకుంటారు. మనకు పరస్పరం పరిచయం లేకపోవచ్చుగానీ మనం కలిసి నడవడం నేర్చుకోవచ్చు. ఈ నిరాశామయ లోకంలో ప్రతికూలతలను అలా కాకుండా ఇంకెలా అధిగమించగలం?

# చేసింది చెప్పే సమయమొచ్చింది

బీఆర్ఎస్ 2023 ఎన్నికలలో గెలవకపోవటానికి ఒక ముఖ్య కారణం, తన పాలనా కాలంలో చేసిన మంచిని ప్రజలకు వివరించి చెప్పకపోవటమని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కొన్ని సందర్భాలలో అన్నారు. విమర్శకులు దీనిని స్వీయసమర్థనగా కొట్టివేయవచ్చుగాక. కాని పరిశీలించి చూసినట్లయితే అందులో నిజమున్నట్లు అర్థమవుతుంది. ఆ నిజమేమిటో మునుముందు పరిశీలిద్దాము. దానినట్లుంచి, ఇపుడు త్వరలో పార్టీ శ్రేణులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నందున, బీఆర్ఎస్ పాలనలో జరిగిన మంచిని ప్రజలకు వివరించి చెప్పగల విధంగా కార్యకర్తలను సిద్ధం చేయటం ఆ శిక్షణలో భాగం కావాలి. ఆ చర్చల్లోకి వెళ్లేముందు గతంలోకి చూసి కొన్ని విషయాలు చెప్పుకోవాలి. తెలంగాణ ఉద్యమ మలిదశ సుమారు 1996 నుంచి మొదలుకాగా, 2001లో టీఆర్ఎస్ స్థాపన నుంచి ఉధృత రూపానికి వచ్చింది. 2014 మధ్య వరకు సుదీర్ఘంగా సాగింది. కాని మరొకవైపు నుంచి చూసినపుడు రెండు కొరతలు కన్పించాయి. ఒకటి, జాతీయస్థాయిలో సానుభూతి, సానుకూలత రావలసినంతగా రాలేదు. రెండు, ఉద్యమ కారణాలేమిటో, పరిస్థితులు ఏమిటో సంవత్సరాలు గడుస్తున్నా ఇతర రాష్ట్రాల ప్రజలకు సమాచారాలు చేరలేదు. సగకాలం గడిచినాక ప్రొఫెసర్ జయశంకర్ బృందం ఢిల్లీ వెళ్లి వేర్వేరు పార్టీల నాయకులను కలిసి మద్దతు లేఖలు సంపాదించగలిగింది గాని అది అంతటితో ఆగిపోయింది. అట్లాగే, స్వరాష్ట్రాల కోసం పోరాడిన, పోరాడుతుండిన పార్టీల నాయకులు కొందరు అక్కడి నుంచో, హైదరాబాద్‌కు వచ్చో మద్దతు తెలియజేశారు. ఇటువంటివి ఉండి కూడా మొత్తంమీద చూసినపుడు, పైన అన్నట్లు, జాతీయస్థాయి మద్దతు కొరవడింది. ఇతర రాష్ట్రాలకు సమాచారాలు స్వల్పంగానే చేరాయి. జాతీయ మీడియా అనేది సహకరించలేదు. అట్లా ఎందుకు జరిగిందో చెప్పుకోవాలి. ముందుగా జాతీయస్థాయి సంగతి చూద్దాం. జాతీయస్థాయి అంటే ప్రధానంగా ఢిల్లీ, అక్కడి నుంచి పనిచేసే ప్రభుత్వం, జాతీయ, ప్రాంతీయ పార్టీలు, అధికార యంత్రాంగం, మేధావివర్గాలు, మీడియా (భారతీయ మీడియా, విదేశీ మీడియా). రాష్ట్ర సాధనా ఉద్యమం సఫలం అయేందుకు ఉద్యమం బలంగా సాగటం ఎంత అవసరమో, ఈ వివిధ వర్గాలను ప్రభావితం చేయటం కూడా అంతే అవసరం. ఎందుకంటే ఈ వర్గాలలో కొన్ని ఒపీనియన్ మేకర్స్ కాగా, కొన్ని డెసిషన్ మేకర్స్. వారిని ఒక పద్ధతి ప్రకారం ప్రభావితం చేసేందుకు ఉద్యమానికి ఏ దశలోనూ ఒక ప్రణాళిక లేకపోయింది. కాని మరొకవైపు నుంచి తెలంగాణ వ్యతిరేక శక్తులు ఒక ప్రణాళిక ప్రకారం ఆ పని చేస్తూపోయాయి. ఆ శక్తులు ముప్పేటగా పనిచేశాయి. అది ఆర్థిక సంస్కరణల వాతావరణం జోరుగా ఉన్న కాలం, సంస్కరణలకు అప్పటి ప్రధాని మన్మోహన్ నాయకత్వం వహిస్తుండిన కాలం. ఉమ్మడి రాష్ట్రంలో వేగంగా అమలవుతుండిన సంస్కరణలు ఆంధ్రప్రదేశ్ విభజన జరిగితే ఆ వేగం కుంటుపడుతుందని స్వయంగా మన్మోహన్ వ్యాఖ్యానించిన స్థితి. సంస్కరణలకు అనుకూలమైన జాతీయ, అంతర్జాతీయ లాబీలన్నీ విభజనను వ్యతిరేకించటం, రాహుల్‌గాంధీ సహా కాంగ్రెస్‌లోని కొందరు కీలక నేతలు ఈ ప్రభావాలకు లోనుకావటం, విభజన జరిగితే నక్సలిజం పెరుగుతుందంటూ సైన్యాధికారులను సైతం ఈ వ్యతిరేక వాదనలలో భాగం చేయటం వంటివన్నీ కలిసి ఆ ముప్పేటలో ఒక పాయగా పనిచేశాయి. ఆ ప్రభావాలు జాతీయ మీడియాపైనే గాక, ఢిల్లీలో తమ కార్యాలయాలు గల ప్రాంతీయ భాషా పత్రికలపై కూడా పడ్డాయి. రెండవ పాయ, అపుడంతా టీడీపీ అధ్యక్షునిగానో, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగానో ఉండిన చంద్రబాబు తన జిత్తులమారి ఎత్తుగడలను ఉపయోగిస్తూ ఢిల్లీలో రాజకీయ పార్టీలను, సీనియర్ అధికారులను, పారిశ్రామికవర్గాలను, ఇంగ్లీష్ మీడియాను, సీనియర్ జర్నలిస్టులను ప్రభావితం చేయటం. అందుకోసం డబ్బు కూడా చాలానే ఖర్చు చేశారన్నది వినవచ్చిన మాట. ఇటువంటి ఎత్తుగడలకు, జిత్తులకు ఆయన ఇతరత్రా కూడా పేరుపడిన వ్యక్తే అయినందున, తెలంగాణ విషయమై సాగించిన లాబీయింగ్‌ను అర్థం చేసుకోవటం కష్టం కాదు. ఇక మూడవ పాయ, ఉభయ కమ్యూనిస్టులు. ముఖ్యంగా సీపీఎం. ఆ దశలో ఉభయ కమ్యూనిస్టులూ ప్రత్యేక తెలంగాణకు వ్యతిరేకమే కాగా, సీపీఎం వీరవిప్లవ వ్యతిరేకిగా వ్యవహరించింది. కొంత మెతకగా ఉండిన సీపీఐని, తన బిగ్ బ్రదర్ దాదాగిరీతో భయపెట్టింది. బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ భాగస్వాములైన ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ మాత్రం సానుభూతి చూపాయి. ఇక్కడ మరొక రెండు విశేషాలున్నాయి. ఒకటి, సీపీఎంకు ఢిల్లీలో యూపీఏ కూటమి భాగస్వామిగా, బెంగాలీ అయిన ప్రణబ్ ముఖర్జీతోపాటు పశ్చిమబెంగాల్‌లోని గూర్ఖా రాష్ట్ర ఉద్యమాన్ని వ్యతిరేకించేదిగా రాజకీయ పలుకుబడి ఉండేది. అదిగాక బలమైన వామపక్షంగా ఢిల్లీ సీనియర్ అధికారులలో, మేధావివర్గాలలో, రచయితలూ కళాకారులలో, మీడియాలో పలుకుబడి ఉండేది. వారు యథాతథంగానే ఈ వేర్వేరు పలుకుబడులను తెలంగాణ ఉద్యమం పట్ల వ్యతిరేక ప్రచారానికి ఉపయోగించుకున్నారు. ఈ విషయంలో చంద్రబాబుకు సీపీఎం మంచి చుట్టంగా పనిచేసింది. రెండు విశేషాలలో ఇది ఒకటి కాగా, ఆ కాలమంతా సీపీఎంకు సీతారాం యేచూరి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉండి, తెలంగాణకు వ్యతిరేకంగా కంకణం కట్టుకుని పనిచేయటం రెండవది అయింది. ఆంధ్రా ప్రాంతపు ఉన్నత కుటుంబానికి చెంది, ఢిల్లీ జేఎన్‌యూలో చదివి ఎనలిటిస్టు లక్షణాలు బాగా వంటబట్టించుకున్న ఆయనకు, హరికిషన్‌సింగ్ సూర్జిత్ కాలం నుంచి కాంగ్రెస్‌లో, ఇతరత్రా బ్యూరోక్రసీతో, ప్రతిపక్షాలతో, మీడియాలో, మేధావివర్గాలలో మంచి సంబంధాలుండేవి. విషయమేమంటే, ఇటువంటి బలమైన మూడు పాయలతో కూడిన తెలంగాణ వ్యతిరేక లాబీని పూర్తిగా వమ్ముచేయటం ఎంతమాత్రం తేలిక కాకపోయినా, తెలంగాణ శక్తులు ఒక పద్ధతి ప్రకారం వ్యవహరించి ఉంటే కొన్ని వర్గాలలో, ఒక స్థాయి వరకు సానుకూల వాతావరణం తప్పక ఏర్పడే అవకాశాలుండేవి. కాని ఆ ప్రయత్నాలు జరగలేదు.

# ప్రాంతీయవాదం కాదు.. తెలంగాణ ఆత్మగౌరవం: నిరంజన్ రెడ్డి

**తెలంగాణ రాష్ట్రం ఉద్యమకారుల త్యాగాల ఫలితం**
**తెలంగాణ ప్రజల మనోభావాలను అవమానిస్తే సహించబోమని హెచ్చరిక**
**కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమని వ్యాఖ్య**
**కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ**
**బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహించాలని పిలుపు**




**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**

తెలంగాణ ఉద్యమాన్ని ప్రాంతీయవాదంగా అభివర్ణించడం చారిత్రక వాస్తవాలను విస్మరించడమేనని, తెలంగాణ రాష్ట్రం అనేక మంది ఉద్యమకారుల త్యాగాలు, ఆత్మబలిదానాల ఫలితంగా సాధించుకున్నదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. దేవరకద్ర నియోజకవర్గ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను కించపరిచే వ్యాఖ్యలను ప్రజలు సహించరని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం స్వాభిమాన పోరాటమని, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలు, అభివృద్ధి అసమానతల కారణంగానే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలను మరవలేమన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన ఆత్మార్పణను గుర్తు చేస్తూ, రాష్ట్రాల ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమాలను ప్రాంతీయవాదంగా చిత్రీకరించడం సరైన దృక్పథం కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ప్రజల ఆత్మగౌరవం, స్వయంపాలన కోసం సాగిన చారిత్రక పోరాటమని తెలిపారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పాలనను ప్రస్తావించిన నిరంజన్ రెడ్డి, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, కంటి వెలుగు, సాగునీటి ప్రాజెక్టులు వంటి పథకాలు తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది వేశాయని అన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం సైతం అనుసరించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతు సంక్షేమం, ధాన్యం కొనుగోలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక సహాయం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీల అమలులో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పని చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి సభ్యత్వ నమోదును పారదర్శకంగా నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో మాజీ హోంమంత్రి మహ్మూద్ అలీ , రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పల్లె రవి తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి అండగా యువజన సంఘం సభ్యులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన గోరేటి బాలమ్మ గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న క్రాంతి యువజన సంఘం సభ్యులు స్నేహితుడు మల్లేష్ కు 5000 వేల రూపాయలు అందజేశారు. వారితో పాటు మాజీఎంపీటీసీ కడల సంతోష మల్లేష్ 50 కె జి ల బియ్యాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడల సంతోష మల్లేష్, ఉప సర్పంచ్ నిజాముద్దీన్ ,క్రాంతి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేతా

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం పెద్దూర్ తండా గ్రామపంచాయతీలో కేతావత్ దేవుజా నాయక్ మృతి చెందడం జరిగింది. పెద్దూర్ తాండ సర్పంచ్ శ్రీను నాయక్ ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 4000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో,సర్పంచ్ శ్రీను నాయక్ డిప్యూటీ సర్పంచ్ భాస్కర్ నాయక్, వార్డు సభ్యులు , మూడవత్, రుకి బాషా గోగ్లీ కిష్ట సక్రి కిషన్,దీప్ల,గ్రామ పెద్దలు రవి , బాలు, లచ్చు ,రవి తదితరులు పాల్గొనడం జరిగింది.

## ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు (ప్రవేశాలు) ప్రారంభమయ్యాయి అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి వెంకటరమణ ఉపాధ్యాయుడు నరసింహ అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, తరగతులు ప్రారంభం కావడానికి ముందుగానే ఉపాధ్యాయులు బడి బాట లేదా ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్చుకునే ప్రక్రియను ముమ్మరం చేశారు. విద్యార్థులను ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉచితంగా చేర్చుకుంటున్నారు. వారికి కావాల్సిన సదుపాయాలు ప్రభుత్వం నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందుతాయి. అదనంగా, చాలా పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం (ఇంగ్లీష్ మీడియం) బోధన అందుబాటులో ఉంది. దరఖాస్తు విధానం: మీ పిల్లల ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం (టీసీ), మరియు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో నేరుగా సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చు అని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయులు నరసింహ, శ్రీను, యాదయ్య, పాండు, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలి

**నూతన ఎంపీడీవో నీ సన్మానించిన వెల్జాల్ కాంగ్రెస్ నాయకులు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సీతారామమ్మను వెల్జాల్ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామమ్మ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా నిర్భయంగా తనను సంప్రదించవచ్చని తెలిపారు.

వెల్జాల్ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా కృషి చేయాలని గ్రామ నాయకులు ఎంపీడీవోను కోరగా, ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, సింగిల్ విండో డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ అంజయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచ్ అజీజ్, నాయకులు ప్రొద్దుటూరు అశోక్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతించిన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు

**హైదరాబాద్ :** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తాజా చిత్రం 'పెద్ది' ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతించిన సంగతి తెలిసిందే. ఈ ఇరు రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలకు రాంచరణ్ ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు: "తెలుగు సినిమా పరిశ్రమకు నిరంతరం మద్దతు, ప్రోత్సాహం అందిస్తున్న గౌరవనీయులైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ గారు

## పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపొందించుకోవాలి

**పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపొందించుకోవాలి**
**రైతులకు జనుము, జీలుగు విత్తనాల పంపిణీ చేసిన సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఆమనగల్, మండల కేంద్రంలో రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూసారం తగ్గి, పంటల దిగుబడులు క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులు పచ్చిరొట్ట ఎరువుల సాగుపై దృష్టి సారించాలని ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్ వెంకటేష్, ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్య నాయక్ సూచించారు. బుధవారం ఆమనగల్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు జనుము, జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పచ్చిరొట్ట ఎరువుల పంటలైన జనుము, జీలుగను సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంపొందించడంతో పాటు పంటల దిగుబడులను గణనీయంగా మెరుగుపరచుకోవచ్చన్నారు. భూమిలో సేంద్రియ పదార్థాల శాతం పెరగడం వల్ల సూక్ష్మజీవుల వృద్ధి జరిగి, జీవరసాయనిక చర్యలు వేగవంతమై నేల ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూమి గుల్లబారి వర్షపు నీరు సులభంగా భూమిలోకి ఇంకుతుందని, కలుపు మొక్కల పెరుగుదల కూడా నియంత్రణలో ఉంటుందని తెలిపారు. పచ్చిరొట్ట పంటలు పూత దశకు చేరుకున్న తర్వాత వాటిని నేలలో కలియదున్నడం ద్వారా అధిక పరిమాణంలో పోషకాలు నేలకు అందుతాయని పేర్కొన్నారు. తద్వారా రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎనుముల రమేష్, మాజీ మండల అధ్యక్షుడు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సైదులు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ నాయక్, మహేష్, పీఏసీఎస్ సీఈవో పద్మాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఏఈవో బాలకృష్ణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ సత్యం, ఆర్ఎస్కె షాప్ యాజమాని చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

**చెన్నకేశవస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం**
**పాలకవర్గ సభ్యులను సన్మానించిన సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కడ్తాల్,మండల కేంద్రంలో ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి మనిషికి మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల్‌లోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌గా గూడూరు జంగారెడ్డి, సభ్యులుగా రమేష్ గౌడ్, పిప్పళ్ళ యాదయ్య, బాచిరెడ్డి మంజుల, రాంచందర్ నాయక్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఈవో మోహన్‌రావు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంప వెంకటేష్ గుప్తా నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆధ్యాత్మిక కార్యక్రమాల విస్తరణ కోసం నూతన పాలకవర్గం అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ప్రాంతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆలయాలు సమాజానికి సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను అందించే పవిత్ర కేంద్రాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా ఆసిఫ్ అలీ నియామకం

**శుభాకాంక్షలు తెలిపిన పెరుమాండ్ల సురేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తెలంగాణ రాష్ట్ర స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన రేవంత్ రెడ్డి మిత్రమండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీకి తలకొండపల్లి మండల యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సిఫారసు మేరకు గవర్నర్ శివప్రతాప్ శుక్ల ఉత్తర్వులు జారీ చేయడంతో ఆసిఫ్ అలీ రెండేళ్లపాటు ఈ కీలక బాధ్యతలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెరుమాండ్ల సురేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో ఆసిఫ్ అలీ విశేష పాత్ర పోషించారని పేర్కొన్నారు. 2002 సంవత్సరం నుంచి రేవంత్ రెడ్డికి అండగా నిలుస్తూ, ఆయన రాజకీయ ఎదుగుదల కోసం నిరంతరం కృషి చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి మిత్రమండలిని స్థాపించి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. దాదాపు 24 సంవత్సరాలుగా ప్రజా సేవా కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా రేవంత్ రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆసిఫ్ అలీ చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి అయ్యే వరకు ఆయనకు నమ్మకమైన సహచరుడిగా, బలమైన మద్దతుదారుడిగా నిలిచిన ఆసిఫ్ అలీకి ఈ రాష్ట్ర స్థాయి పదవి దక్కడం ఆయన సేవలకు లభించిన గుర్తింపేనని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక వికేంద్రీకరణ, స్థానిక సంస్థల బలోపేతానికి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ కీలక వేదికగా నిలుస్తుందని, ఆ బాధ్యతల్లో ఆసిఫ్ అలీ సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవలో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తూ పెరుమాండ్ల సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఆసిఫ్ అలీ నియామకం పట్ల రేవంత్ రెడ్డి మిత్రమండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

## ఒంటరైన చిన్నారికి మేఘన్న అభయహస్తం అందజేత



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా :**

అవ్వ, తాత , తల్లి, తండ్రి మృతి చెందారు, తనను ఎవరు చేరదీస్తారు అన్న ఆ చిన్నారికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నేనున్నానని భరోసా కల్పించారు. పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన రేణుక దీర్ఘకాల వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందింది ముదిరాజ్ కుటుంబానికి చెందిన రేణుక తల్లిదండ్రులు చనిపోయారు, భర్త లేడు, తాను చనిపోతానని తెలిసి తన చిన్నారి కూతురు భవ్యశ్రీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ 5వ తరగతి వరకు చదివించింది గత కొంతకాలంగా ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంట్లోనే ఉండేది మంగళవారం రాత్రి అనుకోకుండా ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది ఆసుపత్రికి తీసుకువెళ్లిన ఫలితం లేకపోయింది మృతి చెందడంతో ఆమె తరపు బంధువులు ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు తనకున్న ఒకే ఒక ఆధారం తన తల్లి చనిపోవడంతో ఆ చిన్నారి హృదయ వేదనతో ఏడ్చిన ఏడుపులు చూపరులను సైతం కన్నీళ్లు పెట్టించాయి,రేణుక మృతదేహాన్ని ఖననం చేసేందుకు కూడా ఆర్థిక స్తోమత లేకపోవడంతో గ్రామస్తులు చందాలు వేసుకుని ఆమె దహన సంస్కారాలకు తోడ్పాటు అందించారు,విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తీవ్ర మనోవేదనకు గురై తక్షణ సహాయంగా 5000 రూపాయలు అందించారు. చిన్నారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆమె చదువును, బాగోగులను సైతం చూస్తానని అధైర్యం వద్దని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

## నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేత

**25 వేల ఆర్థిక సహాయం అందజేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

సమాజ సేవలో తనదైన ముద్ర వేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. వెల్దండ మండలంలోని అంకమౌనికుంట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం మొకురాల వెంకయ్య ఇంటి నిర్మాణానికి రూ. 25 వేల ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. ఇటీవల గోలి శ్రీనివాస్ రెడ్డిని కలిసి తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించిన మొకురాల వెంకయ్య కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణం పూర్తి చేయడానికి సహకారం అందించాలని కోరారు. వారి పరిస్థితిని తెలుసుకున్న గోలి శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి రూ. 25 వేల నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వారికి అవసరమైన సమయంలో చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు నిర్మించుకోలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు తమ వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని, అవసరమైన ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందుకున్న మొకురాల వెంకయ్య కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ గోలి శ్రీనివాస్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి ఎంతో అవసరమైన సమయంలో సహాయం అందించడం మరిచిపోలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొని గోలి శ్రీనివాస్ రెడ్డి సేవా కార్యక్రమాలను అభినందించారు. గ్రామ ప్రజలు కూడా ఆయన సేవా దృక్పథాన్ని కొనియాడారు.

## పర్యాటకశాఖ అధికారులతో ఎమ్మెల్యే కసిరెడ్డి సమీక్ష

**వెల్జాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.3 కోట్లు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఉన్న ప్రసిద్ధ శ్రీశ్రీశ్రీ వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం పర్యాటకశాఖ ద్వారా రూ. 3 కోట్ల నిధులు మంజూరు కావడంతో, ఆ నిధులతో చేపట్టాల్సిన పనులపై హైదరాబాద్‌లోని తన నివాసంలో పర్యాటకశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, వెల్జాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన క్షేత్రమని, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మంజూరైన నిధులతో ఆలయ పరిసరాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, భక్తులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అలాగే పనుల అమలులో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధితో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక పర్యాటకం మరింత ప్రోత్సాహం పొందడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో పర్యాటకశాఖ డీఈ హనుమంతు రెడ్డి, ఏఈ నితీష్ కుమార్, ఆర్కిటెక్ట్ హర్షి నాయుడు, గణేష్ రాజు, ఆలయ ధర్మకర్త జి. శ్రీనివాసమూర్తి, ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఆయిల్ అంజయ్య గౌడ్, పి. అశోక్ బాబు, ఎం.ఏ. అజీజ్, రావిచెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జన్మదిన శుభాకాంక్షలు నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాక్స్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, పాక్స్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, కౌన్సిలర్ పాపిశెట్టి రాము హాజరయ్యారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో హరీష్ రావు చేసిన సేవలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన అంకితభావం చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో హరీష్ రావు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వం, ప్రజల పట్ల నిబద్ధత యువతకు ఆదర్శమని అన్నారు. రానున్న రోజుల్లో హరీష్ రావు ఆశయాలకు అనుగుణంగా కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు మరింత చేరువవుతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎనమళ్ళ రమేష్, అనంతుల సైదులు గౌడ్, కడ్తాల్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, చలిచీమల సతీష్, గుజ్జరి గోపి, పూసల భాస్కర్, జంతుక కిరణ్, రాముల మహేష్, శ్రీను నాయక్, రేపని శివ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని హరీష్ రావు జన్మదినాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. హరీష్ రావు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ ప్రజల గుండె చప్పుడు తన్నీరు హరీష్ రావు



జగదేవపూర్ లో ఘనంగా మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండల కేంద్రంలోని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదినం సందర్భంగా మండల బి అర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పనగట్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అర్చన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల గుండె చప్పుడు తన్నీరు హరీష్ రావు అని అన్నారు. తెలంగాణ ఉద్యమ పోరాటంలో లెజెండ్ లీడర్ ఆయన వచ్చిండంటే ప్రతి పక్ష నాయకుల్లో రైలు పరిగెత్తించే నాయకుడని ఆయన అష్టయురోగ్యాలతో నుండు నూరేండ్లు వర్ధిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేశం గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, గజ్వేల్ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ ఏక్బాల్, మాజీ ఎంపిటిసి ల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్, మాజీ ఎంపిటిసి ల ఫోరం మండల అధ్యక్షులు కావ్య దర్గయ్య, మాజీ రైతు బంధు అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మన్ జంబూల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంకిళ్ల యాదవ రెడ్డి, సర్పంచ్ లు ఆలేటి కవిత లోలకర్ రెడ్డి, అశోక్,

**ఉప సర్పంచ్ మచ్చ గణేష్,**

మండల మహిళా అధ్యక్షురాలు కవిత శ్రీనివాస్ రెడ్డి, జగదేవపూర్ గ్రామ బి ఆర్ యస్ అధ్యక్షులు బుద్ద నాగరాజు, మండల యూత్ విభాగం అధ్యక్షులు బాలకృష్ణ నాయకులు కొంపల్లి మహేష్ చెక్కల నరేష్ రొయ్యల కరుణాకర్ కేశమైన మహేందర్ యాదవ్ చిలుకూరి మధుసూదన్ రెడ్డి బత్తిని శ్రీనివాస్, మచ్చ బాబు డప్పు సాయికుమార్ ఇస్మాయిల్, హాజీ, భాస్కర్, ఉప సర్పంచ్ పోకల రాంచంద్రం కర్ణాకర్ అలీమ్ బొల్లు ఐల్లయ్య నరేష్ ముక్కెర సంజీవులు అరుణ్ కుమార్ కొన్నే స్వామి మ్యాడమైన సిద్దులు బి అర్ ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ నూతన కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపిన ఎన్ సీ సంతోష్



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ నూతన కమిషనర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గణేష్ రెడ్డిని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన బిఆర్ఎస్ యూత్ వింగ్ నాయకుడు ఎన్ సీ సంతోష్, అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారానికి నూతన కమిషనర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు, బి ఆర్ ఎస్ నాయకులు శివ, బాకీ స్వామి, బొజ్జ రవి, నవాజ్, సింగం, మర్రి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## భారీ దొంగతనం..



పత్తాలేని సీసీ కెమెరాలు
రెండు నెలలవ్యవధిలో భారీ దొంగతనం

అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్

సుల్తానాబాద్ మండల కేంద్రంలోని సుద్దాల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫొద్దీన్ గత వారం రోజుల క్రిందట భూమి అమ్మిన డబ్బులు ఐదు లక్షల 87 వేల రూపాయలు ఇంట్లో బీరువాలో పెట్టి బక్రీద్ సందర్భంగా ఊరికి వెళ్లడంతో మంగళవారం రోజున ఇంటి తలుపులు తెరిచి ఉండగా చుట్టుపక్కల వారు ఆయనకు సమాచార అందించడంతో హుటాహుటిన ఇంటికి వచ్చి బీరువాలో ఉన్న డబ్బులను వెతకగా దొంగతనం జరిగిందని తెలుసుకొని సుల్తానాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం...? ఇది ఇలా ఉంటే గత రెండు నెలల కిందట ఓ రైతుకు చెందిన గొర్లు దొంగతనానికి గురయ్యాయని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. సుద్దాల గ్రామంలో ఈ దొంగతనం జరగడం రెండు నెలల వ్యవధిలో రెండోసారనీ ప్రజలు అంటున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం సీసీ కెమెరాల పట్ల నిర్ణయం తీసుకొని ముఖ్యకూడళ్ళ లోబిగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సుల్తానాబాద్ మండలం కేంద్రంలోని చాలా గ్రామాలలో సీసీ కెమెరాలు పత్తాకు లేకుండా పోయాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

## పచ్చునూర్ గ్రామంలో కార్తీక్ అంత్యక్రియలకు హాజరైన టిఇపిఏ వ్యవస్థాపకుడు ధార మధు

అగ్ని ధార న్యూస్, (మానకొండూర్) :

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన టి జి పి ఏ సెక్యూరిటీ ఫోర్స్ రాష్ట్ర కన్వీనర్ దాసారపు సదానందం కుమారుడు కార్తీక్ మంగళవారం రోజున స్వర్గస్తులయ్యాడు. ఈ విషాద ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం కార్తీక్ అంత్యక్రియల కార్యక్రమానికి తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఏ) వ్యవస్థాపకుడు ధార మధు హాజరయ్యాడు. ఈ సందర్భంగా కార్తీక్ పాడెను మోయడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కార్తీక్ మృతి పట్ల పలువురు గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంత్యక్రియల్లో గ్రామ ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.

## ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య

అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:

విద్యార్థులకు ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ అన్నారు. బుధవారం మహ్మదాబాద్ మండలంలోని గాదిర్యా ల్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని ప్రైవేట్ కు దీటుగా విద్యా బోధన అందజేస్తున్నామన్నారు ఉచిత పుస్తకాలు మధ్యాహ్న భోజనంతో పాటు యూనిఫామ్, డిజిటల్ ఆధారిత క్లాసులు అలాగే విద్యార్థులకు చిన్నప్పటినుండే కంప్యూటర్ పై పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## మంత్రి హరీష్ రావు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆలేటి సంతోష్ రెడ్డి



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం సిద్దిపేట జిల్లా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన సందర్బంగా బి ఆర్ యస్ జిల్లా యూత్ విభాగం నాయకులు ఆలేటి సంతోష్ రెడ్డి తన్నీరు హరీష్ రావు కి పూల బొకేతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావు నిండు నూరేండ్లు వర్ధిల్లాలని అష్టయురోగ్యాలతో వర్ధిలాలని మారినో పదవులు అధిరోహించాలని కోరుకున్నారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ లో అటవీశాఖ గజ్వేల్ రేంజ్ తరపున కల్పకవనం అర్బన్ పార్క్ లో నడక మరియు అటవీ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా అటవీశాఖ తరపున ఒకటో తారీకు నుండి ఆరవ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో మొదటి రోజు ఆర్డిఓ మేడం చేతుల మీదుగా పోస్టర్ విడుదల చేయడం జరిగిందని, రెండవ రోజు తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకలు, ఈరోజు వాసవి క్లబ్ మరియు అటవీశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ నివారణ కొరకు ఇంటింటా మొక్కలు నాటడం గురించి పర్యావరణ పరిరక్షణ కోసం, అటవీ జంతువులను కాపాడుటం కోసం, బైక్ ర్యాలీలో నినాదాలు చేస్తూ, అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు, అనంతరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పవన్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ప్లాస్టిక్ వస్తువులను వాడటం నిషేధించాలని అటవీ ప్రాంతాన్ని పరిరక్షించాలని అన్నారు, ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ జగ్గయ్యగారి శేఖర్, అటవీ శాఖ అధికారులు డిఆర్ఓ రాజమణి ఫారెస్ట్ శిక్షణ అధికారులు శకావత్ హరిప్రసాద్, బీట్ అధికారులు కిషోర్ రాజు స్వామి ఐలయ్య ప్రసాద్, వాసవి క్లబ్ సభ్యులు కాశీనాథ్, కైలాస ప్రశాంత్, ఉమేష్, నితీష్ , రాములు రమేష్ తదితరులు పాల్గొన్నారు

## మాజీ మంత్రి హరీష్ రావు నిండు నూరేళ్ళు సంతోషంగా ఉండాలి



మాజీ సర్పంచ్ రావికంటి చంద్ర శేఖర్
సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

అగ్నిధార సిద్దిపేట జిల్లా

గజ్వేల్ నియోజకవర్గం మాజీమంత్రి హరీష్ రావు జన్మదినం సందర్భంగా సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్ర శేఖర్, ఆధ్వర్యంలో మేడారంలో సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి హరీష్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఉండాలని రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత పదవులు స్వీకరించాలని అమ్మవార్లను కోరుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జన హృదయ నేత మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా



గజ్వేల్ నియోజకవర్గం మాజీ మంత్రి శాసనసభ పక్షాపనేత జనహృదయనేత తన్నీరు హరీష్ రావు జన్మదిన సందర్భంగా గజ్వేల్ మండలంలోని కేసరి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేకమైన పూజలు చేసిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి గ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అనంతరం కేక్ కట్ చేసి హరీష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల గుండె చప్పుడు ఒక లెజెండ్ లీడర్ సమస్యల పరిష్కారం కొరకు మామకు తగ్గ అల్లుడు అని నిరూపించుకున్న నాయకుడు హరీష్ రావు ప్రజల హృదయల్లో నిల్చిన నాయకుడుని అన్నారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండే నాయకుడు హరీష్ రావు అన్నారు. కార్యకర్తలు కొలిపోయిన కుటుంబాలకు చెక్కులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సి యాదవరెడ్డి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చైర్మన్ చందన, మాజీ చైర్మన్ రాజమౌళి గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి బి ఆర్ యస్ మండల ఇంచార్జి బెండే మధు మునిపల్ కౌన్సిలర్స్ బి ఆర్ యస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సేవలకు అంతర్జాతీయ గుర్తింపు

డాక్టరేట్ నీ సన్మానించిన
జాజుల శ్రీనివాస్ గౌడ్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

విద్యా, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ విద్యావేత్త అయిల్ సదానందం గౌడ్ గారికి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్ పురస్కారం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి అభినందనలు తెలియజేస్తూ ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, సామాజిక విద్యావేత్తగా, నీతి--నిజాయితీ, అంకితభావంతో విద్యా రంగంలో సదానందం గౌడ్ చేసిన కృషికి గౌరవ డాక్టరేట్ లభించడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఇలాంటి పురస్కారాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో మే 17న జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ తరఫున సదానందం గౌడ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సదానందం గౌడ్ ప్రభుత్వ హాస్టల్‌లో చదువుకొని, ప్రసిద్ధ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., ఎం.ఫిల్., బి.ఎడ్., సెట్ కోర్సులను ప్రథమ శ్రేణిలో పూర్తి చేశారు. గత 26 సంవత్సరాలుగా లెక్చరర్‌గా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ విశేష సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వర్, బాలరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొని సదానందం గౌడ్‌ను అభినందించారు.

## నాగర్‌కర్నూల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

సీఎం సొంత జిల్లాపై నిర్లక్ష్యం తగదు జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ నాగర్‌కర్నూల్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు విమర్శించారు. కల్వకుర్తిలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాగా గుర్తింపు పొందిన నాగర్‌కర్నూల్‌కు అదనపు నిధులు, ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు ఏవీ అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కొనసాగుతున్న పలు సాగునీటి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయని, వాటి పూర్తి కోసం ప్రభుత్వం చొరవ చూపడం లేదని ఆరోపించారు. విద్య, వైద్య రంగాల్లో జిల్లాకు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని, ఇప్పటికీ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని అన్నారు. పరిశ్రమల స్థాపన విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. జిల్లాలో గ్రానైట్, కాగితం పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ వాటి అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. జూన్ 4, 5 తేదీల్లో జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి నిధులు ప్రకటించాలని జిల్లా ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. ఆంజనేయులు, సి. ఆంజనేయులు, జిల్లా నాయకులు ఏపీ మల్లయ్య, బాలస్వామి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ నీ కలిసిన సభ్యుడు అసిఫ్ అలీ

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నూతన చైర్మన్ రాజయ్యను రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు అసిఫ్ అలీ బుధవారం హైదరాబాద్‌లోని ఇర్రమంజిల్ ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసిఫ్ అలీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతం, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఫైనాన్స్ కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. చైర్మన్ రాజయ్య నాయకత్వంలో కమిషన్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు, ఆర్థిక వనరుల సమన్వయం వంటి అంశాలపై ఇరువురు నాయకులు సానుకూలంగా చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో రేవంత్ మిత్ర మండలి సభ్యులు ఆనంద్, ఆంజనేయులు, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్ తదితరులు పాల్గొని రాజయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగగా, రాష్ట్ర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు.

## ఖేతి బచావో



అగ్నిధార న్యూస్ కమన్పూర్

బుధవారం గొల్లపల్లి గ్రామంలో ఖేతి బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో నేల సంరక్షణపై అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది, రసాయనిక ఎరువులకు బదులుగా జీవన ఎరువులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని తెలియజేయడం జరిగింది, సరియగు వర్షపాతం నమోదైన తర్వాతనే పంటలను సాగు చేయాలని తెలియజేయడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో కెవికె రామగిరి కిల హెడ్ డాక్టర్ వెంకట్ రమేష్ , డాక్టర్ బి నవ్య గ్రామ సర్పంచ్ మల్లయ్య మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్వేత మరియు రైతులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి సాయం అందజేత

అగ్నిధార న్యూస్ కమన్పూర్

కమాన్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దాసరిపల్లె పేద కుటుంబానికి చెందిన దాసరి అన్నపూర్ణ వయసు 52 సంరాలు. దాదాపు వారం రోజుల క్రితం వడదెబ్బ తగిలి అనారోగ్యంతో మరణించిన వార్త బోగే రమేష్ ద్వారా సమాచారం అందుకున్న బోనాల వెంకటస్వామి ఫౌండేషన్ సభ్యులను పంపి వారి కుటుంబ సభ్యులని పరామర్శించి వారికి నిత్యవసర సరుకులు, 25 కిలోల బియ్యం అందజేశారు.

**ఈకార్యక్రమంలో దాసరి బ్రహ్మయ్య,**

దాసరి సందీప్, తనుశ్రీ, కృష్ణ, కవిత, రాజ్ కుమార్, ప్రణయ్, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కన్నూరి నగేష్, సెక్రటరీ చిప్పకుర్తి అరవింద్ సభ్యులు చెన్నోజు చంద్రశేఖర్, దండే తిరుపతి, ప్రసాద్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసేవారికి "కౌన్సిలింగ్" ఇవ్వండి

**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్.**

భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు "కౌన్సిలింగ్" నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయూసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీగదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా వున్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు ఎలావున్నారు..ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక "కౌన్సిలింగ్" ఇవ్వాలని, రౌడీ షీటర్లపట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీపై నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమర్, రాజమౌళి పాల్గొన్నారు.



# భారీ ఫ్లైఓవర్ కోసం సర్కార్ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లైఓవర్ నిర్మించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌బీ నగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో.. ఇప్పటికే చాలా ఫ్లైఓవర్లు నిర్మించగా.. తాజాగా మరొకటి నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.416 కోట్లను కూడా కేటాయించింది. త్వరలోనే ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూసేకరణ పనులు చేపట్టేందుకు అధికారులు రెడీ అయ్యారు.విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లను గుర్తించి.. అక్కడ భారీ ఫ్లైఓవర్లను నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా నగరంలో మరో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్లతో 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగరంలోని తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. టీకేఆర్ కాలేజీ, గాయత్రీనగర్, మందమల్లమ్మ జంక్షన్ల మీదుగా నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్ వల్ల ఎయిర్‌పోర్టు మార్గంలో ట్రాఫిక్ తగ్గనుంది.అంతేకాకుండా మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం లభించనుండగా.. ఎల్‌బీ నగర్ నుంచి పాతబస్తీ వైపు ప్రయాణం కూడా మరింత సులభతరం కానుంది. త్వరలోనే భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ పనులు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ఎల్‌బీ నగర్ జోన్‌లో రూ.416 కోట్ల వ్యయంతో ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.టీకేఆర్ కాలేజీ జంక్షన్, గాయత్రీనగర్ జంక్షన్, మందమల్లమ్మ జంక్షన్‌ల మీదుగా ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు కింద ఈ పనులను ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) టర్న్‌కీ విధానంలో కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ చేపట్టనుంది. ఎల్బీ నగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం ఈ 3 జంక్షన్ల వద్ద తీవ్రంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. మరీ ముఖ్యంగా గత 10 ఏళ్లలో మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ వంటి ప్రాంతాల్లో జనాభా గణనీయంగా పెరగడంతో పాటు.. వాహనాల రాకపోకలు కూడా భారీగా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతాల నుంచి నగరానికి వెళ్లే ప్రయాణికులతో నిత్యం ఆ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఈ 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి అయితే నగర తూర్పు భాగాన్ని విస్తరించిన దక్షిణ ప్రాంతాలతో అనుసంధానం చేయడంలో కీలక పాత్ర పోషించనుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మీర్‌పేట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాల ప్రజలకు వేగవంతమైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయని చెబుతున్నాయి. అలాగే ఎల్‌బీ నగర్ జంక్షన్ నుంచి సంతోష్‌నగర్ మీదుగా పాతబస్తీ వైపు వెళ్లే ప్రయాణికులకు కూడా ప్రయాణ సమయం భారీగా తగ్గే అవకాశం ఉందని వెల్లడిస్తున్నాయి.మున్సిపల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఫ్లైఓవర్‌కు సంబంధించి.. త్వరలోనే భూసేకరణ, విద్యుత్ లైన్లు, నీటి పైపులు వంటి యుటిలిటీ షిఫ్టింగ్ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే నగర తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.



# ట్రాఫిక్ చలాన్లపై బిగ్ అప్‌డేట్.. నెల రోజులే గడువు, త్వరపడండి

**హైదరాబాద్ :** ట్రాఫిక్ చలాన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాహనదారులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తేల్చి చెప్పింది. ఇందుకోసం నెల రోజుల గడువు ఇచ్చింది. నెల రోజుల తర్వాత వివరాలు నమోదు చేసుకోకపోయినా.. ట్రాఫిక్ చలాన్ పంపించినట్లుగానే భావిస్తామని స్పష్టం చేసింది. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత కఠిన వైఖరి అనుసరించడంలో భాగంగా సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వాహనదారులపై పోలీసులు చలాన్‌లు విధించి.. వారిపై కొరఢా ఝుళిపిస్తూ ఉంటారు. అయితే కొంతమంది వాహనదారులపై అనేక ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నా.. పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతూ ఉంటారు. ఈ క్రమంలోనే కొందరు వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు దొరికినప్పుడు వారి బండి నంబర్ ఆధారంగా చెక్ చేస్తే.. వేలల్లో ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉండటం మనం చూస్తూనే ఉన్నాం. చాలా మంది పోలీసులకు చిక్కకుండా.. ట్రాఫిక్ చలాన్లను కట్టకుండా.. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తూ.. ఫైన్లు కొండలా పేరుకుపోయే వరకు ప్రయాణిస్తూ ఉంటారు. అయితే ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.ఇందులో భాగంగానే తెలంగాణలోని వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఇక నుంచి ట్రాఫిక్ చలాన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పక్కాగా ఓనర్లకు చేరేలా తెలంగాణ రవాణా శాఖ సరికొత్త నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. ట్రాఫిక్ చలాన్లకు సంబంధించిన అలర్ట్స్‌ను ఎప్పటికప్పుడు పొందేందుకు ప్రతీ ఒక్కరూ తమ వివరాలను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేసింది.



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. ప్రతీ ఒక్క వాహనదారుడు తమ మొబైల్ నంబర్, వాట్సాప్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ వంటి వివరాలను నెల రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ అయిన వాహన్ (లజీష్ట్రజీని.జూజీతీతిలజీష్ట్రజీని.ఐనీల.తిని లో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది.ఇక ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల గడువు ముగిసిన తర్వాత.. వాహన్ పోర్టల్‌లో నమోదై ఉన్న సెల్ నంబరు, ఈ-మెయిల్‌కు ఎస్ఎంఎస్, వాట్సాప్, మెయిల్ ద్వారా ట్రాఫిక్ చలాన్లను సంబంధిత వాహన యజమానికి పంపిస్తారు. ఇలా పంపిన ట్రాఫిక్ చలాన్లు.. వారికి అందినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇంతకుముందు లాగా.. తమ ఫోన్‌కు ట్రాఫిక్ చలాన్ రాలేదని.. దానికి సంబంధించి మెసేజ్ కూడా రాలేదని.. అసలు తమ బండిపై ట్రాఫిక్ చలాన్ ఉందనే సమాచారం కూడా తమకు తెలియదని వాహనదారులు చలాన్లు తప్పించుకోవడానికి వీలు ఉండదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.గతంలో ఇలాంటి సాకులు చెప్పి.. కొందరు వాహనదారులు ట్రాఫిక్ చలాన్లు కట్టకుండా తప్పించుకునే వారని తెలిపాయి. పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్ల వసూళ్లను మరింత వేగంగా వసూలు చేయడానికి.. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత పారదర్శకతను పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## పంచాయతీ సెక్రటరీ సేవలు మరువలేనివి



**గజ్వెల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వెల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ సతీష్ బదిలీపై వెళుతున్న సందర్భంగా గజ్వెల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి కేశమైన మహేందర్ యాదవ్ మాజీ ఉప సర్పంచ్ జూపల్లి భాస్కర్, బొల్లు ఐలయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీ సతీష్ సేవలు మరువలేనివని, గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజల సమస్యలు ఉంటే వెను వెంటనే స్పందించి పరిష్కారం చేసి ప్రజల మన్నాలను మెప్పు పొందారని అన్నారు. దౌలాపూర్ నుండి బెజగామ గ్రామానికి బదిలీపై వెళుతున్న అక్కడ కూడ ప్రజలకు చేరువై మంచి పేరు ప్రాక్యతలు పొందాలని అన్నారు.

## ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయాల పోస్టులకు దరఖాస్తులు

**జిల్లా విద్యాశాఖాధికారి జి. శారదా**

**48 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభం కోసం తాత్కాలిక నియామకాలు**



**అగ్నిధార న్యూస్ పెద్దపల్లి, జూన్ 03:**

తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలు, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకులు, సమగ్ర శిక్ష, తెలంగాణ, హైదరాబాద్ వారి ఉత్తర్వుల మేరకు పెద్దపల్లి జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరానికి నూతనంగా 48 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ 48 ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన 10 నెలల గౌరవ వేతనంతో ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు ఆయాల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ (10ం2) లేదా దానికి సమానమైన అర్హత కలిగి ఉండాలని, ప్రారంభ బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికలో అభ్యర్థులకు సంబంధిత ప్రీ-ప్రైమరీ పాఠశాల ఉన్న ఆవాసం, అదే గ్రామ పంచాయతీ , అదే మండలం , అదే జిల్లా క్రమంలో ప్రాధాన్యత కల్పించబడుతుందని తెలిపారు.

నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని వివరించారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు విద్యార్హత, వయస్సు, నివాస ధృవీకరణ తదితర సంబంధిత సర్టిఫికెట్ల ప్రతులను జతచేసి, సంబంధిత ప్రీ-ప్రైమరీ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు 2026 జూన్ 9వ తేదీ సాయంత్రం వరకు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి. శారదా కోరారు.

ప్రీ-ప్రైమరీ విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇరువురికి సన్మానం



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వెల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలశీ లో జగదేవపూర్ గ్రామ పంచాయతీ లో నూతనముగా పదవి భాద్యతలు చేపట్టిన మండల పరిషత్ సూపరిండెంట్ రామచంద్రరావు జగదేవపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వికాస్ రెడ్డి ని కాంగ్రేస్ మాజీ సర్పంచ్ కొత్త లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొంపెల్లి కరుణాకర్, ఇమ్మడి శివ లక్ష్మి జహంగీర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో అమర రాము, ఎండీ అజీస్ వార్డు సభ్యులు తాటిపాముల ఆంజనేయులు, దండే వెంకటేష్, కొంపెల్లి నర్సింలు, రాగుల మల్లేశం, కొత్త మధుసూదన్ రెడ్డి, ఎర్ర సత్యం వద్ది సాయి కుమార్ కాంగ్రేస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సహాయ నిరాకరణలో అధికారులు - నేతల ఒత్తిళ్లు

**హైదరాబాద్ :** తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం ఇప్పుడు పల్లెల్లో తీవ్ర పొలిటికల్ హీట్ పుట్టిస్తోంది. ఎన్నికల హామీలలో భాగమైన 'ఆరు గ్యారంటీలలో' ఒకటైన ఈ పథకం కింద సొంత స్థలం ఉన్న నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. పథకం ఉద్దేశం అద్భుతమైనదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మాత్రం గ్రామాల్లో లొల్లికి, అధికార పార్టీలోనే అంతర్గత విభేదాలకు వేదికగా మారుతోంది. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత ప్రారంభించారు. మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి సగటున 3,500 ఇళ్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. అయితే, గ్రామాల వారీగా చూస్తే ఒక్కో పంచాయతీకి కేవలం 30 నుండి 40 ఇళ్లు మాత్రమే కోటాగా వస్తున్నాయి. కానీ, ప్రతి పల్లెలోనూ దరఖాస్తు చేసుకున్న ఆశావహుల సంఖ్య వేలల్లో ఉండటంతో అసలు సమస్య మొదలైంది. గ్రామంలో అర్హులైన నిరుపేదలు వందల సంఖ్యలో ఉంటే, కేటాయించిన అరకొర ఇళ్లను ఎవరికి ఇవ్వాలో తెలియక స్థానిక అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు

# 'పెద్ది' రిలీజ్‌కు ముందే మెగా హంగామా..

## కూకట్‌పల్లిలో రామ్ చరణ్‌కి ఆలయం ఏర్పాటు





మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే తెలుగు రాష్ట్రాల్లో అభిమానుల సందడి తారాస్థాయికి చేరుకుంది. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, సినిమా విడుదలకు ముందు నుంచే మెగా అభిమానులు థియేటర్ల వద్ద పండుగ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.ప్రత్యేకంగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతం మరోసారి అభిమానుల సందడికి కేంద్రబిందువుగా మారింది. టాలీవుడ్‌లో పెద్ద హీరోల సినిమాల విడుదల సందర్భంగా భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సాధారణమే. అయితే ఈసారి అభిమానులు మరింత ప్రత్యేకంగా ఆలోచించి, 'పెద్ది' సినిమాలో కనిపించే రామ్ చరణ్ పాత్రను ప్రతిబింబించేలా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అర్జున్ థియేటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి అభిమానులు 'శ్రీ రామ్ చరణ్ ఆలయం' అనే పేరుతో ప్రత్యేక ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. గ్రామీణ నేపథ్యంలోని 'పెద్ది' పాత్రను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ విగ్రహం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. థియేటర్ వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేశారు.అంతేకాకుండా కొందరు అభిమానులు విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి, కర్పూర హారతులు ఇస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. డప్పులు, బ్యానర్లు, నినాదాలతో థియేటర్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ వేడుకలకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచాయి. 'ఆర్ఆర్ఆర్' వంటి గ్లోబల్ విజయానంతరం రామ్ చరణ్ నుంచి వస్తున్న పూర్తి స్థాయి రా అండ్ రస్టిక్ మాస్ ఎంటర్‌టైనర్ కావడంతో 'పెద్ది'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో చరణ్ కొత్త అవతారంలో కనిపించనున్నాడనే ప్రచారం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోలపై భారీ స్పందన కనిపిస్తుండగా, థియేటర్ల వద్ద అభిమానులు చేస్తున్న హంగామా చూస్తుంటే 'పెద్ది' విడుదల రోజు మెగా వేడుకలు మరింత భారీ స్థాయిలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో అన్న ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో నెలకొంది.



## కంగనా రనౌత్ 'భారత్ భాగ్య విధాత' ట్రైలర్ విడుదల!

ముంబై 26/11 ఉగ్రదాడుల నేపథ్యంలో, ప్రాణాలకు తెగించి పోరాడిన నిజమైన హీరోల కథతో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ నటించిన తాజా చిత్రం 'భారత్ భాగ్య విధాత' (దీష్టుతీఫ్ దీష్ట్రష్టుస్త్రుఝ ఎఱసనష్టుఘ్ఝ -- ఎష్ట్రవ ఖఅంవవఅ నవతీశీవం). ఈ సినిమా జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. 2008లో ఉగ్రవాదులు ముంబైలోని కామా హాస్పిటల్‌పై దాడి చేసినప్పుడు, అక్కడ దాదాపు 400 మంది రోగులను, గర్భిణీలను, చిన్న పిల్లలను కాపాడటానికి ప్రాణాలను పణంగా పెట్టిన నర్సులు, వార్డ్ బాయ్స్ మరియు హాస్పిటల్ సిబ్బంది వీరోచిత పోరాటమే ఈ సినిమా ముఖ్య కథాంశం. ఈ చిత్రంలో కంగనా రనౌత్ ఒక సాధారణ నర్సు పాత్రలో కనిపించబోతున్నారు. ఇంట్లోనూ, సమాజంలోనూ పెద్దగా గుర్తింపు లేని ఒక సాధారణ మహిళ, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎంతటి సాహసానికి ఒడిగట్టిందనేది ఈ ట్రైలర్‌లో ఎమోషనల్‌గా మరియు ఉత్కంఠభరితంగా చూపించారు. మనోజ్ తపారియా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్, కంగనా రనౌత్‌కు చెందిన మణికర్ణిక ఫిల్మ్స్ మరియు పరమహంస క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ చిత్రంలో కంగనాతో పాటు గిరిజా ఓక్, స్మితా తాంబే, అమృతా నామ్‌దేవ్, ఈషా దే ముఖ్య పాత్రలు పోషించారు.

## మళ్లీ పెళ్లి పీటలెక్కనున్న ఆమిర్ ఖాన్.. హాజరుకానున్న సల్మాన్, షారుఖ్!





బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ మరోసారి కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నారు. 61 ఏళ్ల ఆమిర్ తన భాగస్వామి, 47 ఏళ్ల గౌరీ స్ప్రాట్‌ను జులై 5న వివాహం చేసుకోబోతున్నట్లు సమాచారం. ముంబైలోని ఆమిర్ నివాసంలో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వేడుక చాలా సైలెంట్‌గా, ప్రైవేట్ రిజిస్టర్ మ్యారేజ్ రూపంలో జరగబోతుంది. తమ బంధాన్ని అధికారికం చేసుకోవాలని ఈ జంట ఇటీవలనే నిర్ణయించుకుందని, ఇరు కుటుంబాల మద్దతుతో ఇప్పటికే వివాహ ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయని వారి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల మధ్యే ఈ వేడుకను ముగించాలని వారు భావిస్తున్నారు. ఈ ప్రైవేట్ వివాహ వేడుకకు ఆమిర్ ఖాన్ మిత్రులైన బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ కూడా హాజరయ్యే అవకాశం ఉందని బాలీవుడ్ వర్గాల్లో గట్టిగా ప్రచారం నడుస్తుంది. గౌరీ స్ప్రాట్‌కు గత వివాహం ద్వారా క్విన్ అనే ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆమె తాతగారైన ఫిలిప్ స్ప్రాట్ బ్రిటన్ సంతతికి చెందిన కమ్యూనిస్ట్ కాగా, ఆయన 1920లలో భారతదేశానికి వచ్చి ఇక్కడి స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొన్నారు. గత ఏడాది ముంబైలో జరిగిన తన ప్రీ-బర్త్‌డే వేడుకలో ఆమిర్ ఖాన్ మొదటిసారిగా గౌరీని మీడియాకు పరిచయం చేశారు. ఆమిర్ ఖాన్‌కు ఇది మూడో వివాహం కానుంది. ఆయనకు గతంలో రీనా దత్తాతో వివాహం జరగ్గా, వారికి జునైద్, ఇరా అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ తర్వాత ఆయన దర్శకురాలు కిరణ్ రావును వివాహం చేసుకోగా, వారికి ఆజాద్ అనే కుమారుడు జన్మించాడు. ఆమిర్, కిరణ్ రావు జంట 2021లో తమ విడాకులను ప్రకటించారు. ఇప్పుడు జులై 5న జరగబోయే రిజిస్టర్ మ్యారేజ్ మరియు చిన్న ఫ్యామిలీ గెట్-టుగెదర్ ద్వారా ఆమిర్, గౌరీ తమ వైవాహిక జీవితాన్ని ప్రారంభించనున్నారు.

## త్రిషకు మెగా కోడలి సర్‌ప్రైజ్ గిఫ్ట్.. అదేంటో తెలుసా?



హీరోయిన్ త్రిషకు మెగా ఫ్యామిలీ సర్‌ప్రైజ్ ఇచ్చింది. మెగా కోడలు, రామ్ చరణ్ సతీమణి ఉపాసన నుంచి ప్రత్యేక బహుమతిని అందుకుంది. అత్తమ్మాస్ కిచెన్ నుంచి స్పెషల్ సర్‌ప్రైజ్ గిఫ్ట్ పొందింది. అత్తమ్మాస్ కిచెన్ నుంచి త్రిషకు ప్రత్యేక గిఫ్ట్ హ్యాంపర్ చేరింది. ఈ విషయాన్ని త్రిష సోషల్ మీడియాలో పంచుకుంది. థ్యాంక్ యూ ఉపాసన.. ది సమ్మర్ స్పెషల్ గిఫ్ట్.. అంటూ ఆనందం వ్యక్తం చేసింది. కాగా.. అత్తమ్మాస్ కిచెన్ పేరుతో ఉపాసన, చిరంజీవి సతీమణి సురేఖ ఈ వంటకాలు తయారు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచారు. ఇందులో కేసరి, పొంగల్, ఉప్మా, రసం లాంటి వంటకాలు ఉండనున్నాయి. అత్తమ్మాస్ కిచెన్‌లో పులిహోర వంటకం ఎక్కువగా ఫేమస్ అయింది. త్రిషకు పంపిన గిఫ్ట్ హ్యాంపర్‌లో రుచికరమైన ఆవకాయ పచ్చళ్లతో పాటు వివిధ రకాల పొడులు కూడా ఉన్నాయి. దీంతో త్రిష ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇక త్రిష విషయానికొస్తే.. విజయ్ సీఎం అయ్యాక ఆమె పేరు మార్మోగిపోతోంది. ఎక్కడ చూసినా వీరిద్దరి గురించే చర్చ నడుస్తోంది. త్వరలోనే త్రిష పెళ్లి చేసుకోనుందని రూమర్స్ కూడా వస్తున్నాయి. వాటన్నింటికీ త్రిష సైతం తనదైన శైలిలో కౌంటర్స్ ఇస్తూనే ఉంది. ఇటీవల నా కుక్కకు మాత్రమే వ్యక్తగత విషయాల్లో అనుమతి ఇస్తానని రూమర్స్‌ను ఉద్దేశించి పోస్ట్ చేసింది.

## 'కరుప్పు' బ్లాక్ బస్టర్.. సీఎం విజయ్‌ను కలిసిన దర్శకుడు ఆర్‌జే బాలాజీ



'కరుప్పు' సినిమా బ్లాక్ బస్టర్ అందుకోవడంతో ఈ చిత్ర దర్శకుడు ఆర్‌జే బాలాజీ.. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నాడు. ఈ సందర్భంగా తన 'కరుప్పు' కథను మొదట విన్నందుకు సీఎం విజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విజయ్‌ను ముఖ్యమంత్రి హోదాలో కలవడం తనకు ఒక కలలా అనిపిస్తోందని, ఆయనలో ఇప్పటికీ అదే ప్రేమ, ఆప్యాయత, ప్రశాంతత కనిపిస్తున్నాయని బాలాజీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఇప్పటికే రూ. 300 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకుపోతుంది. సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో నటించారు. నిజానికి 'కరుప్పు' సినిమా కథను ఆర్‌జే బాలాజీ మొదట విజయ్ కోసమే సిద్ధం చేశారు. విజయ్ రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో రాకముందు, ఆయన చివరి చిత్రంగా దీనిని తెరకెక్కించాలని భావించి కథను కూడా వినిపించారు. అయితే, ఆ సమయంలో పలు సమీకరణాలు, రాజకీయ ప్రవేశం వంటి కారణాల వల్ల విజయ్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవాల్సి వచ్చింది. ఆయన ఈ సినిమా చేయనప్పటికీ, స్క్రిప్ట్ చర్చల సమయంలో విజయ్ అడిగిన ప్రశ్నలు, ఇచ్చిన సలహాలు కథను మరింత మెరుగుపరచడానికి ఎంతో ఉపయోగపడ్డాయని బాలాజీ గతంలో వెల్లడించారు. అందుకే ఈ సినిమా ప్రారంభ క్రెడిట్స్‌లో విజయ్‌కు ధన్యవాదాలు కూడా తెలిపారు. విజయ్ నో చెప్పిన తర్వాతే ఈ స్క్రిప్ట్ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ద్వారా హీరో సూర్య వద్దకు వెళ్ళింది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com